
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శనివారం 7 జూన్ 2025

ఉష్ణోగ్రత (అంచనా) 7-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	27
తెనాలి	40	27
నరసరావుపేట	39	27
బాపట్ల	39	28
రెంటచింతల	40	29
చీరాల	39	28

కంది ఉచితం కొందరికే!


- జిల్లాకు 408 క్వింటాళ్లు మద్దతు ధర పెంపుతో సాగుకు మొగ్గు
- గతేడాది 67 వేల ఎకరాల్లో కంది పంట సాగు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు రైతులందరికి అందడం లేదు. ఉచితంగా పంపిణీ చేసే కంది విత్తనం కొందరు రైతులకే పరి మితం కానుంది. జిల్లాకు 408 క్వింటాళ్ల కంది విత్తనం ప్రభుత్వం కేటాయించింది. ఈ నెలాఖరు నుంచి పంపిణీ చేసేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. కంది సాగు విస్తీర్ణం, విత్తన పంపిణీకి పొంతన లేదు. కంది మద్దతు ధర క్వింటాకు రూ.8 వేలు ఉండటంతో రైతులు ఈ పంట సాగు వైపు మొగ్గుచూపు తున్నారు. కంది సాగును ప్రోత్సహించేందుకు కేంద్రం మద్దతు ధర క్వింటాకు రూ.450 పెంచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యం లోనే విత్తనం కూడా ఉచితంగా పంపిణీ చేయనుంది. అందరికి కంది విత్తనం ఉచితంగా అందజేయాలని రైతులు కోరుతున్నారు.

సాధారణ కంది సాగు విస్తీర్ణం 48,147 ఎకరాలు. గత ఖరీఫ్‌లో 67,345 ఎకరాల్లో సాగైంది. ఇదే స్థాయిలో ఈ ఏడాది కూడా కంది సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. అయితే విత్తన సరఫరా సాగు స్థాయిలో లేదు. అరకొరగా కంది విత్తనం జిల్లాకే కేటాయించడం గమనార్హం. ఉచితంగా కంది విత్తనం ఎకరాకు నాలుగు కిలోలు పంపిణీ చేస్తారు. జిల్లాకు 408 క్వింటాళ్ల కంది విత్తనం ప్రభుత్వం ఏపీ సీడ్స్ ద్వారా కేటాయించగా వీటిలో ఎల్ఆర్‌జీ 52 రకం 400 క్వింటాళ్లు.. 105 రకం 8 క్వింటాళ్లు ఉన్నాయి. విత్తన కేటాయిం పులు 10,200 ఎకరాలకే సరిపోతుందనేది అంచనా. 67 వేల ఎకరాలకు పైగా కంది సాగు అయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ స్థాయిలో కంది విత్తన కేటాయింపులు జరగలేదు. మొక్కుబడిగా విత్తన నిల్వలు కేటాయించి ప్రభుత్వం చేతులు దులుపుకుంటుందని రైతులు విమర్శిస్తున్నారు. విత్తన పంపిణీ వ్యవసాయ శాఖకు తలనొప్పిగా మారనుంది. ఈ నేపథ్యంలో విత్తన కేటాయింపులు కూడా పెంచాలి. కందిసాగు చేసే ప్రతి ఒ క్కరికీ ఉచితంగా విత్తన పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

గత పాపం అన్నదాతకు శాపం!



- అన్నదాత సుఖీభవ పథకానికి సాంకేతిక చిక్కులు
- వైసీపీ అస్తవ్యస్త రీసర్వేతో రైతుల లబోదిబో
- తహసీల్దార్ లాగిన్‌లకు వేలల్లో రెవెన్యూ రికార్డులు
- లబ్ధికి దూరం చేయొద్దంటూ అన్నదాతల వేడుకోలు
- తుది నిర్ణయంపై యంత్రాంగం తర్జనభర్జన

గత ప్రభుత్వం అస్తవ్యస్తంగా చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియ ప్రస్తుతం రైతులకు శాపంగా మారుతోంది. ఒక నిర్దిష్ట ప్రణాళిక లేకుండా ఇష్టారీతిన భూ రికార్డులను ఆన్‌లైన్ చేయడంతో వాటిని ఉన్న పళంగా సరిచేసుకోలేక రైతు లు లబోదిబోమంటున్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన లబ్ధిదారుల జాబితా సిద్ధం చేసే కసరత్తు ముమ్మరంగా జరుగుతోంది. ఆన్ లైన్ రికార్డులన్నీ యంత్రాంగం వద్దకు చేరా యి. వేల సంఖ్యలో రెవెన్యూ చిక్కులు కనబడ డంతో వాటిని తహసీల్దార్ లాగిన్‌లకు వెరిఫి కేషన్ కోసం పంపించారు. ఇలా పంపించిన వాటిలో దాదాపు 70 శాతం గత ప్రభుత్వం చేసిన రీసర్వే తప్పిదాలేనని తెలుస్తోంది. రెవెన్యూ చిక్కులు తేలకుండా అన్న దాత సుఖీభవ పథకం అర్హుల జాబితా లో చేర్చడంపై తుది నిర్ణయం తీసుకోలేమనేది అధికారుల వాదనగా ఉంది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ ప్రకారం సాగు పెట్టుబడి సాయం కింద రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దానిలో భాగంగా అర్హులైన లబ్ధిదారుల జాబితా తయారు చేయాలని వ్యవసాయశాఖకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పీఎం కిసాన్ కింద కేంద్రం మూడు విడతల్లో ఇచ్చే రూ.6 వేలు సాయానికి మరో రూ.14 వేలు కలిపి రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు సాయం అందించనుంది. ఈ నెల రెండో వారంలోనే ఈ పథకం అమలుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

మూడు జిల్లాల్లో 68 వేలు పెండింగ్

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టే క్రమంలో ఆన్‌లైన్‌లో నిక్షిప్తమై ఉన్న రికార్డులను మరోసారి పరిశీలించి జాబితా సిద్ధం చేశారు. బాపట్ల జిల్లాలో మొత్తం 3,41,974 ఆన్‌లైన్ రికార్డులను పరిశీలించి 2,97,630 మందిని అర్హులుగా యంత్రాంగం గుర్తించింది. వీటి విషయంలో కూడా వ్యవసాయ కమిషనరేట్ (మిగతా 6వ పేజీలో)



ఉచిత బియ్యం.. రూ. 13

- బహిరంగంగా షాపుల వద్దే కొనుగోలు
- బ్లాక్ మార్కెటింగ్ మొదలు పెట్టిన డీలర్లు
- కేజీకి రూ.4 లాభంతో మాఫియాకి చేర వేస్తున్న వైనం

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరఫరా వాహనాలతో బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతుంది.. అక్రమాలను అడ్డుకోవాలి.. అని కూటమి ప్రభుత్వం డీలర్ల వ్యవస్థను ప్రవేశపెట్టగా రేషన్ అక్రమాలు యథావిధిగానే కొనసాగుతున్నాయి. అయితే గతంలో ఎండీయూ వాహన దారులు పాత్రను ఇప్పుడు రేషన్ డీలర్లు తీసుకున్నారు. గతంలో ఎండీయూ వాహనదారులు కార్డుదారులకు బియ్యం ఇవ్వకుండా డబ్బులతో సరిపెట్టగా అదే పంథాను ఇప్పుడు పలు ప్రాంతాల్లోని డీలర్లు చేస్తున్నారు. అయితే గతంలో కార్డుదారులకు రేషన్‌వాహనదారులు రూ.8 నుంచి రూ.10 వరకు ఇవ్వగా ఇప్పుడు డీలర్లు ఆ మొత్తాన్ని రూ.13 కు పెంచారు. ఐదు రోజుల్లోనే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పలువురు రేషన్ డీలర్లు బ్లాక్ మార్కెటింగ్‌ని మొదలు పెట్టేశారు. షాపుల వద్ద ఎలాంటి బెదురు లేకుండా బియ్యం కొనుగోలు చేస్తున్నారు. కేజీకి రూ.13 చొప్పున లెక్కకట్టి కార్డుదారులతో వేలిముద్ర వేయించుకుని నగదు ఇస్తున్నారు. సాయంత్రానికి అన్ని లెక్కలు సరిచూసుకుని మాఫియా పంపించే వాహనంలో బియ్యాన్ని తరలిస్తున్నారు. కేజీకి రూ.4 లాభం చూసుకుని మాఫియాకి రూ.17కి విక్రయిస్తున్నారు. కాగా రేషన్ మాఫియాలోని వ్యక్తులు ఆ బియ్యాన్ని మిల్లర్లకు ఇచ్చి మరో రూ.4 మిగిల్చుకుంటున్నారని సమాచారం.

తూతూమంత్రంగా తనిఖీలు

పౌరసరఫరాల అధికారులను నిత్యం షాపులను తనిఖీ చేసి నిల్వలు సక్రమంగా ఉండేలా పర్యవేక్షించాలని ఆదేశించినప్పటికీ ఒక్కో సీఎస్‌డీటీ కింద వందకు పైగా షాపులు ఉండటంతో వాళ్లు సరిగా చూడలేకపోతున్నారు. డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ ప్రారంభమై ఐదు రోజులు పూర్తి కాగా దాదాపుగా 56.74 శాతం పంపిణీ పూర్తి అయింది. ఇందులో కనీసం 20 శాతం ఇప్పటికే నల్లబజారుకు తరలి నట్లు ఒక అంచనా. తనిఖీలు తూతూ మంత్రంగానే ఉం టుండటంతోనే డీలర్ల అక్రమాలు వెలుగుచూడటంలేదని తెలుస్తోంది. ఈ ఐదు రోజుల్లో కనీసం ఒక్క కేసు అయినా నమోదు చేసిన దాఖలాలు లేవు. గుంటూరు జిల్లాలో 972 దుకాణాలు ఉండగా 5 లక్షల 89 వేల 531 కార్డులున్నాయి. ఇప్పటివరకు 3,31,562 కార్డుదారులకు పంపిణీ చేసి రాష్ట్రంలో 24వ స్థానం అంటే కింది నుంచి మూడులో ఉన్న ది. బాపట్ల జిల్లా 62.32 శాతం పంపిణీతో 15వ స్థానం, 68.99 శాతంతో పల్నాడు జిల్లా మూడో స్థానంలో ఉంది.

షైనింగ్ స్టార్స్.. 461 మంది

గుంటూరు(విద్య), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్‌స్టార్ అవార్డులు అందజేయనున్నారు. అవార్డులకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి 461 మంది ఎంపికైనట్లు విద్యాశాఖ ప్రకటించింది. గుంటూరు జిల్లా నుంచి 112 మంది, బాపట్ల జిల్లా నుంచి 185 మంది, పల్నాడు జిల్లా నుంచి 164 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. బాల బాలికలు, సామాజిక వర్గాల వారీగా విద్యార్థులను ఎంపిక చేశారు. త్వరలో విద్యామంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో షైనింగ్‌స్టార్స్‌గా ఎంపికైన 461 మందికి నగదు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపిక అందజేస్తారని విద్యాశాఖ అధికారులు శుక్రవారం ప్రకటించారు.

ఆగని.. ఆక్రమణలు



చెరువు స్థలంలో నిర్మిస్తున్న ఇళ్లు

- పిడుగురాళ్లలో మొదలైన కబ్జాల పర్వం
- చెరువు ప్రాంతంలో యథేచ్ఛగా నిర్మాణాలు
- అధికారుల హెచ్చరికలను పట్టించుకోని అక్రమార్కులు



పిడుగురాళ్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అధికారం అండతో భూ అక్రమార్కులు చెలరేగారు. కూటమి ప్రభుత్వంలోనూ వారి హవా కొనసాగు తోంది. పిడుగురాళ్ల ఆర్టీసీ బస్టాండ్ వెనుకవైపు ఉన్న చెరువు ప్రాంతంలో గత కొద్ది రోజులుగా ఆక్రమణల జోరు మొదలైంది. వైసీపీ హయాంలో ఇష్టానుసారంగా చెరువు స్థలాన్ని ఆక్రమించి ప్లాట్లుగా అమ్మేశారు. దాచేపల్లి, పిడుగురాళ్ల, మాచవరం మండలాలకు చెందిన వారు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టారు. అయితే అప్పుడు అధికారులు మౌనం వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలకు ఆస్కారం లేకుండా చేయాలని మున్సిపల్ అధికారులను అధికార పార్టీ నేతలు కోరారు. అయినా గత నెల రోజులుగా చెరువు భాగంలోని ఆక్రమిత స్థలాన్ని ఓ వైసీపీ నేత ఒకరిద్దరికి విక్రయించాడు. ఈ స్థలంలో రాత్రి సమయంలో గుట్టుగా నిర్మాణాలు చేపట్టారు. విషయం తెలిసిన మున్సిపల్ అధికారులు ఆ కట్టడాలను పాక్షికంగా తొలగించి హెచ్చరించారు. అయితే శుక్రవారం ఆ ప్రాంతంలో పర్యటించిన మున్సిపల్ అధికారులు అనధికార కట్టడాలను చూసి విస్తుపోయారు. ఆక్రమిత ప్రాంతంలో రెండేళ్ల క్రితం మున్సిపల్ నిధులు రూ.19 లక్షలు వెచ్చించి రోడ్డు కూడా నిర్మించారు. ఆ రహదారిని కూడా కబ్జా చేసి కొందరు నిర్మాణాలు చేపట్టారు. స్థలం డాక్యుమెంట్లను పరిశీలించాక విద్యుత్ మీటరు మంజూరవుతోంది. అయితే ఇక్కడ అలాంటివి ఏవీ లేకపోయినా అక్రమంగా నిర్మించిన ఇళ్లకు మీటర్లు మంజూరు చేశారు. తాజాగా రెండు, మూడు గృహాలకు మీటర్ల మంజూరు చేశారు. చెరువు స్థలంలో నిర్మాణాలు జరిపే గృహాలకు మీటర్లు మంజూరు చేయవద్దని కమిషనర్ సర్వే నెంబర్ల సహా విద్యుత్‌శాఖ అధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేసినా అధికారులు మీటర్లు మంజూరు చేయడం వెనుక నగదు చేతులు మారిందనే ఆరోపణలున్నాయి. అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోక పోవడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారని తెలుస్తోంది. దీంతో చెరువు స్థలం ఇప్పటికే సగానికి పైగా అక్రమ నిర్మాణాలతో నిండిపోయింది.

అనుమతి లేని నిర్మాణాలపై నిఘా

చెరువు స్థలంలో అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలపై నిఘా పెడతాం. సచివాలయ సిబ్బంది వెళ్తే కొందరు బెదిరిస్తున్నారు. అనుమతి లేని కట్టడాలపై ఇప్పటికే సర్వే చేశాం. వాటిని తొలగిస్తాం.

- హృదయరాజు, టౌన్‌ప్లానింగ్ అధికారి

సమస్యల పరిష్కారంలో రికార్డు

వినుకొండ ప్రజాదర్బార్‌లో చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో గడిచిన ఏడాది కాలంలో ప్రజా సమస్యల పరిష్కారంలో సరికొత్త రికార్డు సాధించామని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. వినుకొండలోని జీవీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బారు నిర్వహించగా ప్రజలు తరలివచ్చి సమస్యలపై వినతిపత్రాలు అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి వెంటనే రెవెన్యూ సదస్సులు, వారం వారం ప్రజాదర్బారు ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరి స్తున్నట్లు తెలిపారు. మంత్రి లోకేశ్ స్ఫూర్తితో చేపట్టిన ప్రజాదర్బారుతో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య దూరం తగ్గిందన్నారు. తక్షణ స్పందన, సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బారు చేపడు తున్నామన్నారు. ప్రజాప్రతినిధులకు పేదల సాధక బాధలు వినేందుకు, సమస్యలను పరిష్కరించి బాధితుల్లో విశ్వాసం కల్గించడంలో ఈ కార్యక్రమం విజయం సాధించిందన్నారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రాలు స్వీకరిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

ప్రారంభమైన డీఎస్సీ పరీక్షలు

- కేంద్రాల వద్ద అభ్యర్థుల కోలాహలం
- కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ అరుణ్‌బాబు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, డీఈవో చంద్రకళ

నరసరావుపేట టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మెగా డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. నిర్దేశించిన సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహిస్తుండగా అభ్యర్థులు కేంద్రాలకు తరలివచ్చారు. జిల్లాలో ఐదు కేంద్రాలు ఏర్పాటు చేయగా ఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహించారు. ఈ నెల 30 వరకు విడతల వారీగా పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో చంద్రకళ తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతించమని ముందుగానే స్పష్టం చేయడంతో అభ్యర్థులు నిర్దేశించిన సమయం కంటే దాదాపు గంట ముందుగా చేరుకున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. నరసరావుపేటలోని పరీక్షా కేంద్రాన్ని, డీఈవోతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. అభ్యర్థులకు ఏమాత్రం ఇబ్బంది కలగకుండా అన్ని వసతులను కల్పించాలని ఆదేశించారు. అప్రమత్తంగా ఉండి, అవసరమైన వారికి మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని వైద్య శిబిరం సిబ్బందికి సూచించారు.

పోల్ టెండర్లలో కిరికిరి

నాలుగు నెలలకు పైగా కాలయాపన



- ఇప్పటి వరకు పిన్నెల్లి అనుచరుడే నిర్వహణ
- వైసీపీ హయాంలో టెండర్లు లేకుండానే దారాదత్తం
- టెండర్ దారులను పక్కన పెట్టి మరో వైసీపీ వ్యక్తికి కట్టబెట్టేందుకు రంగం సిద్ధం
- విద్యుత్‌శాఖా మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు దరఖాస్తు దారుల సన్నాహం

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారి ఏడాది అవుతుంది. అయినా కొన్ని శాఖల్లో అధికారుల తీరు మారలేదు. విద్యుత్ శాఖలో ఇప్పటికీ వైసీపీ హవా కొనసాగుతోంది. కొందరు వైసీపీ వారికి వంతపాడుతూ వారికి మేలు చేసేలా నిర్ణయాలు తీసుకుంటున్నారనేందుకు నిదర్శనంగా గుంటూరులోని విద్యుత్ శాఖకు సంబంధించి పోల్‌సెంటర్ నిర్వహణ ఉంది. గుంటూరులోని పోల్ సెంటర్(విద్యుత్ స్థంభాలు తయారీ కేంద్రం) బాధ్యతలు అప్పగించేందుకు గత ఏడాది డిసెంబరు 28న టెండర్లు పిలిచారు. టెండర్ దక్కించుకున్న వారు విద్యుత్ శాఖకు రెండేళ్ల పోల్స్ తయారు చేసి ఇవ్వాలి. టెండర్లు దాఖలకు ఈ ఏడాది జనవరి 17 వరకు గడువు ఇచ్చారు. జనవరి 20న ప్రైస్ బిడ్స్ తెరిచి టెండర్ ఖరారు చేయాలని నిర్ణయించారు. అయితే ఇంత వరకు ఆ టెండర్లు వెలుగు చూడలేదు. అప్పటి నుంచి టెండర్ ఫీజుగా రూ.16 లక్షలు చెల్లించిన వారు ఏమి తే లక లబోదిబోమంటున్నారు. గత వైసీపీ హయాంలో పోల్ సెంటర్ దక్కించుకున్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుచరుడు నిర్వహించాడు. వాస్తవానికి అతడు నిబంధనలకు విరుద్ధంగా అప్పట్లో టెండర్‌ను దక్కించుకున్నాడన్న ఆరోపణలున్నాయి. అయితే అప్పటికి అధికారులు మౌనంగా ఉన్నా.. ప్రభుత్వం మారిన తర్వాత కూడా అతడే కొనసాగుతున్నాడు. ఆ తర్వాత విమర్శలు రావడంతో అతడ్ని తప్పుకోమన్నట్లుగా అధికారులు టెండర్ల పేరుతో హడావుడి చేశారు. అయితే అతడు తప్పుకోకుండా అధికారుల సూచనలతోనే కోర్టుకు వెళ్ళి టెండర్లు ప్రక్రియ కొద్ది రోజులు నిలిచిపోయేలా చేశాడని సమాచారం. ఉన్నతాధికారుల ఒత్తిడితో కోర్టు కేసు ఉప సంహరింపచేసి అందుకు నజరానాగా పోల్ సెంటర్‌లో ఉన్న స్టాక్‌ను మరికొంత కాలం అతడికే సరఫరా చేసే అవకాశం కల్పించారు. కోర్టు కేసు తొలగిపోవడంతో టెండర్లు తెరిచి అర్హులను (మిగతా 6వ పేజీలో)

ఇద్దరి అరెస్టు.. 18 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ స్వాధీనం

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి ఎండీఎంఏ డ్రగ్‌ను తీసుకొచ్చి వినియోగిస్తున్న ఇద్దర్ని నల్లపాడు పోలీసులు అరెస్టు చేశారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు మల్లికార్జునపురం ఐదో లైన్‌కి చెందిన ఫొటోగ్రాఫర్ వింజరపు సోమనాథ్, వసంతరాయపురానికి చెందిన చింతల సతీష్ డ్రగ్ వినియోగిస్తున్నారు. నల్లపాడు సీఐ వంశీధర్ వారి ఇళ్లపై దాడులు చేసి అరెస్టు చేశారు వారి నుంచి 18 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరికి బెంగళూరులో ఈ డ్రగ్ ఇచ్చిందెవరు అనే కోణంలోనూ పోలీసులు ఆరా తీస్తున్నారు.

పూర్తి సదుపాయాలతో వసతి గృహాలు : వీసీ



వసతి గృహాలను పరిశీలిస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జీ సింహాచలం

పెదకాకాని, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాలుర, బాలికల, పరిశోధకుల వసతి గృహాల్లో పలు అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి .సింహాచలం తెలిపారు. వేసవి సెలవుల అనంతరం వసతి గృహాల పునఃప్రారంభం నాటికి పూర్తి సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడానికి వర్సిటీ యంత్రాంగం యుద్ధప్రాతిపదికన వివిధ మరమ్మతు పనులు చేపడుతోందని వెల్లడించారు. శుక్రవారం వర్సిటీ పరిధిలోని అన్ని వసతి గృహాలను ఇంజనీరింగ్ విభాగం, వార్డెన్లతో కలిసి మరమ్మత్తు పనులను రిజిస్ట్రార్ పర్యవేక్షించారు. ఈ విద్యా సంవత్సరం నుండి విద్యార్థుల సౌకర్యార్థం అన్ని వసతి గృహాల్లో వాషింగ్ మెషిన్లను ఏర్పాటు చేయనున్నామని, వాటిని ఏర్పాటు చేయడానికి అనుకూల ప్రాంతాలను గుర్తించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వార్డెన్లు ఆచార్య మల్లికార్జున్, ఆచార్య మాధవి, ఎలక్ట్రికల్ డీఈ ఎన్.వెంకటేశ్వరరావు, వాటర్ వర్క్స్ డీఈ కె.సుబ్బారావు, వివిధ శాఖల ఏఈలు డి.సతీష్ కుమార్, ఐ.సాయిరాం, సీహెచ్ ధనుంజయ్, అడిషనల్ వార్డెన్లు పాల్గొన్నారు.

ఆపరేషన్ 'రింకీ'

ఎండీఎంఏ కేసులో కొత్త కోణాలు
జీవన్ గ్యాంగ్‌కు గుంటూరు గ్యాంగ్‌తో సంబంధాలు
ల్యాబ్‌లో నిందితుల ఫోన్ల పరిశీలన

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

నోయిడాకు చెందిన రింకీ, ఢిల్లీకి చెందిన బందోపాధ్యాయ చౌదరి.. ఎండీఎంఏ డ్రగ్‌ను నగరానికి చేర్చడంలో కీలకంగా వ్యవహరించిన వ్యక్తులు వీరు. వీరి చేతికి సంకెళ్లు వేయడానికి పోలీసులు సిద్ధమవుతున్నారు. ఎండీఎంఏను నోయిడా నుంచి హైదరాబాద్ వరకు ట్రాకర్ ఆన్, డీటీడీసీ కొరియర్ల ద్వారా రింకీ పంపితే, దానికి సంబంధించిన డబ్బును బందోపాధ్యాయ చౌదరి క్యూఆర్ కోడ్ స్కానర్‌ను పంపి వసూలు చేసేవాడు. ఇలా హైదరాబాద్‌కు చేరుకున్న ఎండీఎంఏను విజయవాడకు తీసుకొస్తున్న ముగ్గురు యువకులను టాస్క్‌ఫోర్స్, పటమట పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ ముగ్గురిలో జీవన్‌కుమార్ మొత్తం గ్యాంగ్‌కు నాయకుడిగా వ్యవహరిస్తున్నాడు. ఈ ముగ్గురు నిందితులకు ఉన్న లింక్‌ల గురించి పోలీసులు కూపీ లాగడం మొదలుపెట్టారు. కాగా, జీవన్ గ్యాంగ్‌కు గుంటూరుకు చెందిన మరో గ్యాంగ్‌తో సంబంధాలు ఉన్నట్టు తెలిసింది. జీవన్ సరుకును నోయిడా నుంచి రప్పిస్తుంటే, గుంటూరు గ్యాంగ్ మాత్రం బెంగళూరు నుంచి సరుకును రప్పిస్తున్నట్టు గుర్తించారు. ఈ రెండు గ్యాంగ్‌ల మధ్య అనేకసార్లు సరుకు మార్పిడి జరిగినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

సాంకేతిక విశ్లేషణ ఆధారంగా..

తిరుమలశెట్టి జీవన్‌కుమార్, బొంతు నితీష్‌కుమార్, తూలిమెల్లి తరుణ్‌ప్రసాద్‌ను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురిలో జీవన్ తెలివిగా వ్యవహరించాడు. ఎప్పుడైనా పోలీసులకు చిక్కితే ఎలాంటి వివరాలు వారికి తెలియకుండా ఉండటానికి రింకీ, బందోపాధ్యాయ చౌదరితో చేసిన చాటింగ్‌ను డిలీట్ చేశాడు. నితీష్‌కుమార్, తరుణ్‌ప్రసాద్ చేసిన చాటింగ్‌నూ తొలగించాడు. అయితే, సాంకేతిక విశ్లేషణ కోసం నిందితులు ముగ్గురి ఫోన్లను పోలీసులు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. జీవన్‌కుమార్ తొలగించిన మొత్తం డేటాను రిట్రీవ్ చేయాలని నిర్ణయించారు. ఈ ముగ్గురి ఫోన్లలో ఎండీఎంఏను కొనుగోలు చేసిన విద్యార్థుల జాబితా భారీగానే ఉన్నట్టు తెలిసింది. ఈ కేసులో పోలీసులు రింకీని ఏ1గా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. క్యూఆర్ కోడ్‌ను పంపి పేమెంట్ గేట్‌వేల ద్వారా డబ్బు తీసుకున్న బందోపాధ్యాయ చౌదరిని ఏ2గా చేర్చారు. నితీష్, తరుణ్ ఫోన్లలో మాత్రం జీవన్‌తో చేసిన చాటింగ్‌లకు సంబంధించిన కొంత డేటా అందుబాటులో ఉన్నట్టు తెలిసింది. ఎండీఎంఏ ఆర్డర్ కావాల్సినప్పుడల్లా జీవన్, రింకీతో ఎక్కువగా వాట్సాప్ కాల్స్ మాట్లాడినట్టు పోలీసులు గుర్తించారు. మరోపక్క జీవన్‌కు ఎండీఎంఏ రుచి చూపించిన నూజివీడుకు చెందిన మనోహర్ చరిత్రను కూడా పోలీసులు బయటకు లాగుతున్నారు. పార్శిల్‌లో వచ్చిన డ్రగ్‌ను హైదరాబాద్‌కు చేర్చిన ట్రాకర్ ఆన్, డీటీడీసీ కొరియర్ సంస్థలకు పోలీసులు నోటీసులు ఇచ్చే యోచనలో ఉన్నారు.

మళ్లీ వారి చేతికే..!

మాజీ ఎండీయూల ఆపరేటర్లకు డీలర్ల ఈ-పోస్ యంత్రాలు
కొరిటెపాడులో ఇళ్లకు వెళ్లి వేలిముద్రల సేకరణ
బియ్యానికి బదులు నగదు పంపిణీ
ఆ బియ్యం మాఫియాకి చేరవేస్తున్న డీలర్లు

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ ప్రారంభమై ఆరు రోజులు గడిచినా గుంటూరు జిల్లా రాష్ట్రంలోనే అట్టడుగు నుంచి రెండో స్థానం(25)లో ఉంది. దీంతో ఎలాగైనా పంపిణీ శాతం పెంచాలన్న లక్ష్యంతో కొంతమంది రేషన్ డీలర్లు అడ్డదారులు తొక్కుతున్నారు. వాళ్ల వద్ద ఉన్న ఈ-పోస్ యంత్రాలను గతంలో ఎండీయూ ఆపరేటర్లుగా పని చేసిన వాళ్ల చేతికి అందించి.. ఇళ్ల వద్దకు పంపిస్తున్నారు. దీంతో వారు ఇంకా రేషన్ సరుకులు తీసుకెళ్లని వాళ్ల ఇళ్లకు వెళ్లి ఈ-పోస్ యంత్రంపై వేలిముద్ర వేయించి బియ్యానికి బదులు నగదు కేజీకి రూ.13 చొప్పున చేతిలో పెడుతున్నారు. రేషన్ పంపిణీలో పోర్టబిలిటీ తీసుకురావడం, ఈ-పోస్ యంత్రానికి, ఎలక్ట్రానిక్ కాటాకి లింకు తీసేయడంతో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారు.

వారు, వాళ్ల మనుషులే..

ఎండీయూ వ్యవస్థ ఉన్నప్పుడు కొంతమంది రేషన్ డీలర్లు ఆపరేటర్లను లోబరుచుకొన్నారు. దాంతో డీలర్లే ద్విపాత్రాభినయం చేశారు. డీలర్, ఎండీయూ ఆపరేటర్‌గా వాళ్లు/వాళ్ల మనుషులే ఉండేవారు. ఆ బంధాన్ని నేటికీ కొందరు జిల్లాలో కొనసాగిస్తున్నారు. ఒకపక్క మాజీ ఎండీయూ ఆపరేటర్లు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అలానే వైసీపీ చేపట్టిన నిరసన



కార్యక్రమాల్లోనూ క్రియాశీలకంగా పాల్గొంటున్నారు. అయినప్పటికీ వాళ్లని డీలర్లు దూరం పెట్టడం లేదు. తాజాగా గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన ఈ-పోస్ యంత్రంతో కొరిటెపాడులో వేలిముద్రలు వేయించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఇంకా అవగాహన లేదు..

కాగా చాలామందికి ఎండీయూ వ్యవస్థ రద్దు అయిందన్న విషయం తెలియదు. తెలిసిన వాళ్లు మాత్రం రేషన్ షాపులకు వెళ్లి సరుకులు తీసుకొంటున్నారు. రద్దు సమాచారం తెలియని వాళ్లు ఎండీయూ వాహనం వస్తుందిలేనని ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో వాళ్ల వద్దకు ఎప్పటిలానే ఈ-పోస్ యంత్రంతో గతంలో ఎండీయూగా పని చేసిన వ్యక్తి వెళ్లి వేలిముద్ర వేసి నగదు చేతిలో పెట్టేస్తున్నారు. ఈ విధంగా మిగిల్చిన బియ్యాన్ని రేషన్ మాఫియాకి చేరవేసి డీలర్, మాజీ ఎండీయూ ఆపరేటర్ పంచుకొంటున్నారు. ఇందుకు ప్రధాన కారణం పంపిణీ జిల్లాలో తక్కువగా 62 శాతం మాత్రమే ఉండటంతో పైనుంచి డీలర్లపై ఒత్తిళ్లు పెరుగుతుండటమే. వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దనే సరుకులు పంపిణీ చేసే అవకాశం ప్రభుత్వం కల్పించింది. దీనిని వేరే వాళ్లకు కూడా ఉపయోగించి సొమ్ము చేసుకొంటున్నారు.

పోలీసులు వేధిస్తున్నారని.. వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పోలీసుల అరాచకాలకు చెక్ పెట్టాలని జగన్‌కు వినతి
సెల్ఫీ వీడియో విడుదల చేసిన వైనం
సోషల్ మీడియాలో వైరల్
వేధించలేదంటూ పోలీసులు, మేనల్లుడి వివరణ

రాజుపాలెం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అంటేనే పోలీసులు వేధిస్తున్నారు.. పోలీసుల అరాచకాలు చెక్ పెట్టాలి. జగన్నా నేను బతికుంటానో లేదో తెలియదు కానీ ఈ అరాచకాలకు చెక్ పెట్టన్నా అంటూ పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం నెమలిపురికి చెందిన వైసీపీ కార్యకర్త గుత్తా లక్ష్మీనారాయణ పురుగు మందు తాగి శుక్రవారం ఆత్మహత్యకు యత్నించాడు. అతడు ప్రస్తుతం గుంటూరు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సెల్ఫీ వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేసి పురుగు మందు తాగి లక్ష్మీనారాయణ ఆత్మహత్యకు యత్నించాడు.

ఈ వీడియో వైరల్ అయింది. తాను వైసీపీలో ఉండటం వలనే పోలీసులు వేధిస్తున్నారని పేర్కొన్నాడు. కమ్మ వాడివైతే వైసీపీలో ఎలా ఉంటావని డీఎస్పీ తనను బెదిరించాడు.. పోలీసుల అరాచకాలకు చెక్ పెట్టన్నా.. వైసీపీ అంటేనే వేధిస్తున్నారు. నేను చనిపోయాక నా శవాన్ని తాకి పాడె మోయన్నా అంటూ జగన్‌ను అభ్యర్థించాడు. రాష్ట్రంలో మరొకరికి తనలా కాకుడదు. ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నా నా శవాన్ని అయితే నువ్వు మాత్రం పరామర్శించు అన్నా అంటూ వేడుకున్నాడు. వీడియో రిలీజ్ చేసి లక్ష్మీనారాయణ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన బంధువులు ఆయనను తొలుత పిడుగురాళ్ల ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. అయితే వ్యాపారంలో కొంత నష్టం వచ్చిందని కనకరావు, గాంధీ, పెద్దనరసింహారావు, చిన్న నరసింహారావు, రామారావు మరికొంతమంది ఇబ్బంది పెడుతున్నారు. అందుకే తన మామయ్య లక్ష్మీనారాయణకు ఆత్మహత్యాయత్నం చేయాల్సివచ్చింది. దీనిలో ఎవరి ప్రమేయం కానీ, పోలీసుల ప్రమేయం లేదని అతడి మేనల్లుడు విష్ణు తెలిపారు. ఈ మేరకు ఆయన మరో వీడియో రిలీజ్ చేశారు. దీంతో లక్ష్మీనారాయణ ఆత్మహత్యాయత్నానికి రాజకీయం కారణం కాదని గ్రామస్థులు తెలిపారు. లక్ష్మీనారాయణ వయస్సు 50 ఏళ్లు ఉంటుందని ఆయనకు వివాహం కాలేదని వారు తెలిపారు. లక్ష్మీనారాయణ ఆరోపణలను రాజుపాలెం ఎస్ఐ వేణుగోపాల్ ఖండించారు. ఆయన ఎప్పుడు పోలీసు స్టేషన్‌కు రాలేదని చెప్పారు.

ఉచిత బస్సు హామీని విరమించుకోవాలి

గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్

గుంటూరు(తూర్పు), జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన ఉచిత బస్సు హామీని తక్షణమే విరమించుకోవాలని ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మంగా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో శుక్రవారం జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ హామీ అమల్లోకి వస్తే లక్షలాది ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు, ఏడాదికి రూ 15వేలు, 21, 31 జీవోలను రద్దు చేస్తానని ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. జిల్లాలో గ్యాస్ ఆటోలు పెరిగాయని దీనిని దృష్టిలో పెట్టుకుని గ్యాస్ కేంద్రాల సంఖ్యను పెంచాలని కోరారు. సమావేశంలో నగర ఉపాధ్యక్షుడు ఎండి బాబర్, గఫర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంగా శ్రీనివాస్, పాల్గొన్న యూనియన్ నాయకులు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి

కొవిడ్-19 వైద్యసేవలను వినియోగించుకోండి

గుంటూరు మెడికల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో కొవిడ్-19 వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వైద్యం ఉచితంగా అందజేస్తున్నామని, అనుమానితులు ఈ సేవలను వినియోగించుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ రమణయశస్వి తెలిపారు. రోగుల సమస్యలను తెలుసుకుంటూ ప్రతి శుక్రవారం ఆసుపత్రిలో నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రికి వైద్య సేవల కోసం వచ్చే వారు తప్పనిసరిగా మాస్కు ధరించి రావాలని ఆయన కోరారు. జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన ఫ్యాకల్టీ డాక్టర్ అనిల్ కుమార్ రోగులను ఉద్దేశించి మాట్లాడుతూ కొవిడ్ విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరూ తగిన ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు. కొవిడ్ అనుమానిత లక్షణాలతో బాధపడే వారు వ్యాధి నిర్ధారణపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురువైద్యులు, పాలన అధికారులు పాల్గొన్నారు.

గత పాపం.. అన్నదాతకు శాపం

(5వ పేజీ తరువాయి)

ఆర్‌టీజీఎస్ ద్వారా సమగ్ర పరిశీలన చేపట్టిన తర్వాతే తుది జాబితా ఖరారు చేయనుందని తెలుస్తోంది. 21,900 వరకు వివిధ కారణాలతో తిరస్కరణకు గురికాగా 22,714 మంది రైతుల రికార్డులు ఆయా మండలాల తహసీల్దార్ల లాగిన్‌లో పెండింగ్ పడ్డాయి. గుంటూరు జిల్లాలో ఈ సంఖ్య దాదాపు 18 వేల వరకు ఉండగా, పల్నాడులో 27 వేలు వరకు ఉన్నట్లు తెలుస్తోంది. వీరి భూ రికార్డులు ఆన్‌లైన్‌లో తప్పుల తడకగా ఉండడమో లేక నిబంధనల ప్రకారం ప్రక్రియ పూర్తి చేయకపోవడం వల్లనే చిక్కులు తలెత్తాయి.

అస్తవ్యస్త రీసర్వే ఫలితమే...

ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయానికి వేల సంఖ్యలో అన్నదాతలు దూరం అయ్యే పరిస్థితి వైసీపీ రీసర్వే ఫలితమేనని రెవెన్యూ చిక్కులు చెబుతున్నాయి. గత ప్రభుత్వం సర్వే నంబర్ల స్థానంలో ఎల్‌పీఎం ప్రవేశపెట్టడం ప్రధాన కారణంగా తెలుస్తోంది. రీసర్వే ప్రక్రియలో ఓ గ్రూపుగా ఎంపిక చేసి.. వారికి ఎల్‌పీఎం నంబరు కేటాయించి అదే ఘనతగా చెప్పుకున్నారు. వెబ్ ల్యాండ్ డేటా మొదలుకుని ఆధార్ సీడింగ్, పేరు తప్పుగా నమోదు చేయడం వంటి సాంకేతిక తప్పిదాలు కోకొల్లలు. పెండింగ్‌లో ఉంచిన రికార్డుల్లో 70 శాతం గత ప్రభుత్వ రీసర్వే తప్పిదాలేనని అధికారులే ఒప్పుకోవడం గమనార్హం. వీటిని తిరస్కరణ కింద చూపెడితే రైతులు ప్రశ్నిస్తారని, అలా అని అర్హుల జాబితాలో చేర్చడానికి నిబంధనలు ప్రతిబంధకంగా మారాయని యంత్రాంగం చెబుతోంది.

తమ ప్రమేయం లేకుండానే

ఆన్‌లైన్‌లో రికార్డులు తప్పుగా చూపించడం వెనక తాము చేసిందేమి లేదని రైతులు చెబుతున్నారు. అన్నీ పక్కాగా ఉన్నప్పటికీ తప్పుగా నమోదు చేశారని వారు వాపోతున్నారు. ఇదిలా ఉంటే గత ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో కొన్ని చోట్ల ఉద్దేశపూర్వకంగానే తప్పుగా నమోదు చేసినట్లు అన్నదాతలు చెబుతున్నారు. వీటి విషయంలో ఇప్పటికిప్పుడు నిర్ణయం తీసుకోవడం సాధ్యపడదని రెవెన్యూ యంత్రాంగం చెబుతోంది. మరో వైపు అన్నదాత సుఖీభవ పథకం తుది జాబితా ఈ నెల మొదటి వారంలో ఖరారు చేయాలనే పట్టుదలతో ప్రభుత్వం ఉండడంతో.. గత ప్రభుత్వం చేసిన తప్పుకు తాము పెట్టుబడి సాయానికి దూరమయ్యే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాల కార్మికుల సమాచారం తెలపండి

గుంటూరు(తూర్పు), జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో దుకాణాలు, హోటల్స్, కర్మాగారాలు, పరిశ్రమల్లో పనిచేస్తున్న 18 ఏళ్ల లోపు బాల కార్మికుల సమాచారం ఇవ్వాలని ప్రజలను ఉప కార్మిక కమిషనర్ గాయత్రిదేవి ఒక ప్రకటనలో కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే సంబంధిత యజమానులపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల కార్మికులను గుర్తిస్తే 94925 555157, 94925 55144 నంబర్లుకు సమాచారం తెలపాలని పేర్కొన్నారు.

ఎయిమ్స్‌లో 25 లక్షలు దాటిన ఓపీ

మంగళగిరి సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లో ఓపీ సేవలు 25 లక్షల మైలురాయిని చేరినట్టు ఆస్పత్రి వర్గాలు శుక్రవారం తెలిపాయి. అయిదు సంవత్సరాల క్రితమే ఎయిమ్స్‌లో వైద్య సేవలు ప్రారంభించగా, అనతి కాలంలోనే ఈ ఘనత సాధించడం గర్వంగా వుందని పేర్కొన్నారు. లక్షలాది మంది ప్రజల ఆరోగ్య సంరక్షణా అవసరాలను వృత్తి నైపుణ్యంతో తీర్చేందుకు అనేక విభాగాలు, వైద్య బృందాలు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాయని తెలిపారు. మంగళగిరి ఎయిమ్స్ ఈ ఘనత సాధించడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరూ కృతజ్ఞతలు తెలియజేశారు.

83 వృక్షాలకు స్థల మార్పిడి

మంగళగిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని చినకాకానిలో పాత కేన్సర్ ఆస్పత్రి ప్రాంగణంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆస్పత్రి నిర్మాణానికి 83 వృక్షాలు అడ్డుగా ఉన్నాయి. మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో ఆ వృక్షాలను కొట్టివేయకుండా వేరేచోట ఏర్పాటు చేశారు. అధునాతన పరిజ్ఞానంతో ట్రీ ట్రాన్స్ లొకేషన్ పద్ధతిలో నగరంలోని పలు ప్రాంతాల్లో వృక్షాలను ఏర్పాటు చేసి జీవం పోశారు.



విద్యార్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ చినవెంకటేశ్వర్లు, శిక్షకులు

ఐటీఐ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రారంభం

తెనాలి అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల ప్రవేశాల కౌన్సెలింగ్ శుక్రవారం తెనాలి ఐటీఐలో ప్రారంభం అయ్యింది. జిల్లాలోని వివిధ ఐటీఐలలో 298 మంది విద్యార్థులు మొదటి విడత దరఖాస్తు చేశారు. మెరిట్ ఆధారంగా విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి, కళాశాల ట్రేడ్‌లను కేటాయించారు. జిల్లా కన్వీనర్ రావి చినవెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు ఇమ్మానుయేలు, శిక్షకులు పర్యవేక్షించారు.

సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా చెన్నయ్య

గుంటూరు (విద్య) జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ గుంటూరు డిప్యూటీ డైరెక్టర్‌గా యూ చెన్నయ్యను నియమిస్తూ సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. చెన్నయ్య ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో డీఎస్‌డబ్ల్యూఓగా పనిచేస్తున్నారు. మరో రెండుమూడు రోజుల్లో ఆయన గుంటూరులో డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది వెల్లడించారు. ఇప్పటి వరకు సెలవులో ఉన్న గుంటూరు డిప్యూటీ డైరెక్టర్ డీ మధుసూదన్‌రావును రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా.. శ్రీకాకుళం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనపై ఉన్న ఆరోపణలు, విజిలెన్స్ విచారణ తదితర అంశాలపై త్వరలో ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నట్లు చెబుతున్నారు.

రాయగడ, కాచీగూడ ఎక్స్‌ప్రెస్‌లకి
పెరిగిన ఏసీ త్రీటైర్, స్లీపర్ బోగీల సంఖ్య

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాయగడ, కాచీగూడ ఎక్స్‌ప్రెస్‌లకి ఈ నెల 18, 19 తేదీల నుంచి ఏసీ త్రీటైర్, స్లీపర్ క్లాస్ బోగీల సంఖ్య పెరగనుంది. ఈ మేరకు రైల్వే శాఖ నిర్ణయం తీసుకొన్నది. ఆయా తేదీల నుంచి ఈ రైళ్లకు శాశ్వత ప్రాతిపదికన 2 ఏసీ త్రీటైర్, 13 స్లీపర్, ఐదు జనరల్, 2 బ్రేక్ వ్యాన్‌లుంటాయి. అలానే సమ్మర్ స్పెషల్ ట్రైన్‌గా నడుపుతున్న చర్లపల్లి - బ్రహ్మపూర్, బ్రహ్మపూర్ - చర్లపల్లి రైళ్లకు కూడా ఒక అదనపు ఏసీ త్రీటైర్ బోగీని రైల్వే శాఖ మంజూరు చేసింది. దీంతో ఏసీ త్రీటైర్ బోగీల సంఖ్య ఈ రైలుకు మూడుకు పెరిగాయి.

సీనియర్ డీఈఎన్(కోఆర్డినేషన్)గా కే శ్రీనివాస్

గుంటూరు రైల్వే డివిజన్‌లో కీలకమైన సీనియర్ డీఈఎన్(కోఆర్డినేషన్)గా గుంతకల్లులో విధులు నిర్వహిస్తున్న కే శ్రీనివాస్‌ని దక్షిణ మధ్య రైల్వే నియమించింది. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జేవీ అనూషని ఉత్తర రైల్వేలకు బదిలీ చేసింది. అలానే సీనియర్ డీఈఈ జీ సూర్యనారాయణ సికింద్రాబాద్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. సీనియర్ డీఈఈ/టీఆర్ పీ రవితేజని టీఆర్ఎస్‌వోకి బదిలీ చేశారు. నాందేడ్ నుంచి ఏ రవితేజని గుంటూరు డివిజన్‌కు బదిలీ చేశారు.

వచ్చే నెలలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు

గుంటూరు(తూర్పు), జూన్ 6(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంఘ రాష్ట్ర మహాసభలు గుంటూరులో జులై 23, 24 తేదీల్లో జరగనున్నాయని సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ వి నరసింహారావు తెలిపారు. శుక్రవారం పాతగుంటూరు, సీ ఐ టీ యూ కార్యాలయంలో జరిగిన కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సభలకు ఆహ్వాన సంఘ చైర్మన్‌గా, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, అధ్యక్షుడుగా పెరవలి నాగ వంశీ వ్యవహరిస్తారని అన్నారు. ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నిర్మాణ రంగంలో పనిచేస్తున్న అనేకమంది ప్రముఖులను కమిటీలోకి ఆహ్వానించడం జరిగిందని చెప్పారు. మహాసభల్లో నిర్మాణ రంగంలో వస్తున్న సమస్యలను, పరిష్కారం మార్గాలను చర్చించి భవిష్యత్ పోరాటాలకు ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు.

పోల్ టెండర్లలో.. కిరికిరి

(5వ పేజీ తరువాయి)

ఎంపిక చేస్తారని దరఖాస్తుదారులు ఆశించారు. అయితే ఈ ప్రక్రియను పక్కన పడేసినట్లు సమాచారం. పోల్ సెంటర్‌ను టెండర్‌దారులకు కాకుండా పల్నాడు జిల్లా పరిధిలోని వినుకొండ ప్రాంతానికి చెందిన మరో వైసీపీ వ్యక్తికి కట్టబెట్టేందుకు ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేస్తున్నారని తెలిసింది. విశేషమేమిటంటే ఆ వ్యక్తి అసలు టెండరే వేయలేదు. పైగా తగిన అనుభవం కూడా లేదు. కానీ అనర్హుడికి పోల్‌సెంటర్‌ను కట్టబెడుతున్నారనే విషయం వెలుగుచూడటంతో టెండర్ వేసిన వారు రోడ్డెక్కేందుకు సిద్ధమయ్యారు. టెండర్లు ఎప్పుడు పిలిచారు.. ఎంత మంది పాల్గొన్నారు..

ఎవరెవరు పాల్గొన్నారు.. ఇప్పటి వరకు ఎందుకు ఖరారు చేయలేదు.. వంటి సమాచారాన్ని కోరుతూ సమాచార హక్కు ద్వారా విద్యుత్‌శాఖకు టెండర్ దారులు దరఖాస్తు చేశారు. అనర్హుడికి పోల్ సెంటర్‌ను కట్టబెట్టాలనే ఆలో చనకు చెక్ పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. దరఖాస్తుదారులు కోర్టుకు వెళ్లేందుకు కూడా సిద్ధమవుతున్నారని తెలిసింది.

దర ఖాస్తుదారుల్లో టీడీపీకి చెంది న వారు ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ప్రజాప్రతిని ధులకు టెండర్‌లో కిరికిరి గురించి చెప్పి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ దృష్టికి కూడా తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిసింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర


● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే ప్రవీణ్ భేటీ



కలెక్టర్ అరుణ్ బాబుతో కలసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, జూన్ 6 (ఆంధ్ర జ్యోతి): పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబుతో కలసి ఎమ్మెల్యే ప్రవీణ్ సీఎం చంద్రబాబు నాయుడును శుక్రవారం కలిశారు. వెలగపూడిలోని సచివాలయంలో చంద్రబాబును కలసి పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

బ్లాక్ బర్లీ పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి

బ్లాక్ బర్లీ పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. గుంటూరులోని పెదకూరపాడు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్లాక్ బర్లీ పొగాకు రైతుల సమస్యలపై వ్యవసాయ శాఖ ప్రధానకార్యదర్శికి లేఖ రాసినట్టు వివరించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 59 మంది రైతులు 217.65 ఎకరాల్లో బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేశారన్నారు. రైతుల వద్ద 2,312 క్వింటాళ్ళు బ్లాక్ బర్లీ నిల్వలు ఉన్నాయని, 18.06 క్వింటాళ్ళ టాప్ లీవ్స్, 506 క్వింటాళ్ళ బాటం లీవ్స్ ఉన్నాయని వివరించారు. పొగాకు కొనుగోలు చేయకపోవటంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులను ఆదుకొనేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీ మార్క్‌ఫెడ్, ఇతర ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా స్థిరీకరణ చేపట్టాలన్నారు. లేకుంటే అమ్మకాలు జరిగే వరకు రైతులకు తాత్కాలిక ఆర్థిక సాయం అందించాలని కోరారు.

బక్రీదు శుభాకాంక్షలు

పెదకూరపాడు నియోజక వర్గంలోని ముస్లింలకు బక్రీదు పండుగ శుభాకాంక్షలను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శుక్రవారం తెలిపారు. బక్రీదు త్యాగానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. పేదల పట్ల జాలి, దయ, కరుణ కలిగి ఉండటమే బక్రీదు సందేశం అన్నారు. నియోజక వర్గంలోని ముస్లింలందరికీ అల్లా ఆశీస్సులు ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

త్యాగానికి ప్రతీక బక్రీదు

సత్తెనపల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బక్రీదు త్యాగానికి ప్రతీక అని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలోని ముస్లింలకు ఆయన బక్రీదు శుభాకాంక్షలు తెలిపారు. పేదల పట్ల జాలి, దయ, కరుణ కలిగి ఉండటమే బక్రీదు సందేశం అన్నారు. ముస్లింలందరికీ అల్లా ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు.

నేడు అనధికార జంతువధ నిషేధం


● మున్సిపల్ కమిషనర్ వేణుబాబు

మాచర్లటౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బక్రీదు పండుగ సందర్భంగా శుక్రవారం పట్టణ పరిధిలో అనధికార జంతువధ నిషేధమని మున్సిపల్ కమిషన్ శేణుబాబు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా సంపూర్ణమ్మ

రెంటచింతల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజక వర్గం వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా పాముల సంపూర్ణమ్మను నియమిస్తూ వైసీపీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా కందుకూరి మధును నియమించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



గ్రామోత్సవానికి తరలిన వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులు

క్రోసూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్లేరులో ఉన్న పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయం 11వ వార్షికత్సోవం శుక్రవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగింది. పాలకవర్గ సభ్యులు ఉప్పు పరంజ్యోతి, బత్తుల బాబు, అప్పారావు, ఏడుకొండలు, వెంకట నాగేశ్వరరావు, వెంకట స్వామి, దాచేపల్లి చందు తదితరులు పాల్గొన్నారు.

9న అరుణాచలానికి బస్సు

సత్తెనపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 9న సత్తెనపల్లి డిపో నుంచి అరుణాచలంకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్టు డిపో ట్రాఫిక్ ఇన్‌చార్జ్ ఫాతిమా శుక్రవారం విలేకరులకు తెలిపారు. 9వ తేదీ రాత్రి సత్తెనపల్లి డిపో నుంచి బస్సు బయలు దేరి 10వ తేదీ శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్‌టెంపుల్ చూసుకొని అదేరోజు రాత్రికి అరుణాచలం చేరుతుందని ఆమె తెలిపారు. 11వ తేదీ కంచిలో దర్శనం చేసుకొని 12వ తేదీ ఉదయం సత్తెనపల్లికి చేరుతుందన్నారు. టిక్కెట్ రానుపోను ఒక్కొక్కరికి రూ.2500 అని, సత్తెనపల్లి ప్రాంతంలోని భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు 99592 25429, 73828 97583 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

గ్రామీణ తపాలా జీవిత బీమాను సద్వినియోగ పరుచుకోండి

మాచవరం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ తపాలా జీవిత బీమా పథకంలో సభ్యులుగా చేరి ఇన్సూరెన్స్ పథకాలను సద్వినియోగ పరుచుకోవాలని మాచవరం సబ్ పోస్టుమాస్టర్ రమణా నాయక్ సూచించారు. పిన్నెల్లి గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ ఈ పథకంలో చేరి సంవత్సరానికి రూ 8,650 చెల్లిస్తున్నాడు. అనారోగ్య కారణాల వల్ల హుస్సేన్ ఇటీవల మరణించారు. దీనిలో భాగంగా అతని భార్య షేక్ బీ జాన్‌బీకి మాచవరం పోస్టాఫీసులో రూ.1,20,373 నగదు అందజేశారు. కార్యక్రమంలో కొత్తపాలెం, పిన్నెల్లి బ్రాంచ్ పోస్టుమాస్టర్లు మునగాల నారయ్య, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి శాంతి కల్యాణం

పిడుగురాళ్ల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాగుల గుడిలో రాజగోపుర కలశ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా శుక్రవారం శ్రీవల్లి దేవసేన సేమత సుబ్రహ్మణ్యస్వామి శాంతి కల్యాణం దేవస్థానం అర్చకులు గుంటుపల్లి వెంకటేశ్వరశర్మ నిర్వహించారు. పట్టణంలోని వందలాది మంది భక్తులు, దంపతులు కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.

ఫణిదం గ్రామ టీడీపీ మాజీ అధ్యక్షుడు మృతి

సత్తెనపల్లి రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫణిదం గ్రామానికి చెందిన టీడీపీ మాజీ అధ్యక్షుడు నిమ్మగడ్డ పూర్ణయ్య మృతి చెందారు. పూర్ణయ్య మృతి వార్త తెలుసుకున్న గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు శుక్రవారం ఫణిదం వెళ్ళి పూర్ణయ్య మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, బండారుపల్లి నరసింహారావు, కోమటినేని శ్రీనివాసరావు ఉన్నారు.

రాష్ట్రం పచ్చగా ఉంటే ఓర్చుకోలేని జగన్

● వెన్నుపోటు పేరుతో నిరసనలు సిగ్గుచేటు
● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం సుభిక్షంగా ఉంటే మాజీ సీఎం జగన్ ఓర్చుకోలేడు... ఆయన ఐదేళ్ల విధ్వంసపాలనలో కొత్త ప్రాజెక్టు రాలేదు.. నిరుద్యోగాన్ని తగ్గించలేదు.. వెన్నుపోటుకు జగన్ బ్రాండ్ అంబాసిడర్.. దేనికోసం రోడ్డెక్కి నిరసనలు చేస్తున్నారు.. అసలు ఆ అర్హత ఆ పార్టీ వారికుందా అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రశ్నించారు. పాలువాయిజంక్షన్‌లో ఓ వేడుకకు హాజరైన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తల్లిని, చెల్లిని వెన్నుపోటు పొడిచి పక్కన పెట్టావు.. ఇక్కడేమో నిరసన అంటూ పిలుపునిచ్చి నీవేమో బెంగుళూరు ప్యాలెస్‌లో కూర్చున్నావంటూ ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. గొడ్డలిపోట్లతో బాబాయ్‌ను మట్టిలో కలిపింది ఏవరో ప్రజలందరికి తెలుసన్నారు. పోలీసుల మీద దాడిచేసిన గంజాయ్ బ్యాచ్ కుటుంబీకులను పరామర్శించడానికి వచ్చావంటే నీ శాడిస్టు మెంటాల్టీ అర్థమవుతూనే వుందన్నారు. చట్టపరంగా గుండ్లపాడు హత్యకేసు నిందితులకు శిక్ష తప్పదన్నారు. విలేకర్ల సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, సీనియర్ నేత గొంటు ఆదిరెడ్డి, మందలపు హనిమిరెడ్డి, అల్లం బ్రహ్మారెడ్డి, గొట్టం సర్వేశ్వరరెడ్డి, నల్లబిరుదు నరసింహారావు, నాళం పెదబాబు, టీడీపీ రాష్ట్ర వాణిజ్యవిభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, తుఫాన్‌రెడ్డి, కె.సాంబయ్య తదితరులున్నారు.

నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్

● 32 ఏళ్లుగా రోడ్లపైనే బస్సుల నిలుపుదల
● ఎండకు, వానకు ప్రయాణికుల విలవిల
● కారంపూడి బస్టాండ్ నిర్వహణపై అధికారుల అశ్రద్ధ



కారంపూడి ఆర్టీసీ బస్టాండ్

కారంపూడి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందాన మారింది కారంపూడి ప్రజల దుస్థితి. చారిత్రాత్మక ప్రదేశమైన కారంపూడికి పక్కా బస్టాండ్ లేదు. ఎంతోమంది పర్యాటకులు ఈ ప్రదేశానికి వస్తుంటారని 1993లో అప్పటి ప్రభుత్వం ఆర్టీసీ బస్టాండ్ మంజూరు చేసింది. తెనాలికి చెందిన దాతలు ఈ ప్రాంతంలో ఉన్న తన స్థలం ఎకరం బస్టాండ్ నిర్మాణానికి విరాళంగా ఇచ్చారు. సుమారు రూ. 19 లక్షలతో బస్టాండ్ నిర్మించారు. ఏడాది కాలంలో నిర్మాణం పూర్తయి ప్రారంభానికి నోచుకుంది. కొద్ది రోజుల పాటు బస్సులు రాకపోకలు జరిగాయి. ప్రయాణికులు తక్కువగా వస్తున్నారని, దిగేవారు, ఎక్కేవారు లేరనే సాకుతో బస్సులను నడిరోడ్డులోనే ఆపుతున్నారు. దీంతో ప్రయాణికులు ఎండకు, వానకు ప్రధాన రహదారిపై మగ్గవలసి వస్తోంది.

కోర్టును ఆశ్రయించిన స్థలదాత

ఈ మధ్య కాలంలో స్థలదాతకు ఆగ్రహం వచ్చింది. బస్సుల రాకపోకలు లేనప్పుడు నా స్థలాన్ని నాకు ఇవ్వమని కోరారు. ఆర్టీసీ అధికారులు స్పందించకపోతే నేరుగా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. రవాణాశాఖ అధికార యంత్రాంగం స్పందించి బస్సులను బస్టాండ్‌కు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. బస్టాండ్‌కు ఒక వాచ్‌మెన్‌ను కూడా నియమించారు. రెండు నెలలపాటు చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల డిపోలకు చెందిన బస్సులు బస్టాండ్‌కు వచ్చాయి. మరలా బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం బస్టాండ్ చుట్టు పక్కల అపార్ట్‌మెంట్లు, నివాసగృహాలు, వ్యాపారసంస్థలు కూడా వెలిశాయి. ఇక బస్టాండ్‌కు పడమర వైపున చారిత్రాత్మకమైన వీరుల దేవాలయం ఉంది. వీరుల ఉత్సవాలతోపాటు గురు, ఆదివారాల్లో వీరాచారవంతులు, పర్యాటకులు ఈ ప్రాంతానికి తరలివస్తున్నారు. కాలక్రమేణ ఈప్రాంతానికి ప్రజలు రాకపోకలు ఎక్కువయ్యాయి. బస్సులను తనిఖీ చేసే స్క్వాడ్ అధికారుల మాత్రం ఇక్కడకు వచ్చి విశ్రమించి వెళ్తుంటారు. కానీ బస్సుల రాకపోకలు జరగడం లేదు.

బస్సులు బస్టాండ్‌కు రావాలి

- సయ్యద్ రహీం, బస్టాండ్ ప్రాంత వాసి

బస్సులు బస్టాండ్‌కు రావాలి. బస్టాండ్ పరిసర ప్రాంత వాసుల సెంటర్ వరకు వెళ్లి బస్సులు ఎక్కాల్సివస్తోంది. అధికారులు బస్సులు బస్టాండ్‌కు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి

- కాసుల శంకర్, ప్రయాణికుడు

బస్సులు బస్టాండ్‌కు రాకపోవడంతో ప్రజలు నడిరోడ్డుపై వేచి ఉండాల్సివస్తోంది. ఎండకు, వానకు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ ఉన్నప్పటికీ నిరూపయోగంగా తయారైంది. అధికారులు చొరవ తీసుకొని ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి.

అచ్చెన్నాయుడును కలిసిన కన్నా



మంత్రి అచ్చెన్నాయుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ శాఖ మంత్రి కె అచ్చెన్నాయుడును ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం విజయవాడలోని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వ్యవసాయం, పాడి పరిశ్రమల గురించి మంత్రితో కన్నా చర్చించారు. ఇంకా పలు కీలక అంశాలపై చర్చించారు.

మంత్రి సత్యకుమార్‌తో భేటీ..



మంత్రి సత్యకుమార్‌తో..

సత్తెనపల్లి జూన్ 6(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం విజయవాడలోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాల అభివృద్ధి, ఆరోగ్యశాఖకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

క్రోసూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరం గ్రామంలో మూడురోజుల క్రితం దాడికి గురై గుంటూరు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న షేక్ శ్రీను(32) శుక్రవారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం బయ్యవరం గ్రామానికి చెందిన షేక్ శ్రీను, అమరావతి మండలం మునగోడు గ్రామానికి చెందిన సాధనాల గోపీ, సాధనాల విజయ్ మధ్య మద్యం మత్తులో తురగవారిపాలెం గ్రామం వద్ద ఘర్షణ జరిగింది. తరువాత ఎవరి ఇళ్ళకు వారు వెళ్ళిపోయారు. ఈ క్రమంలో సాధనాల గోపీ, సాధనాల విజయ్, మరో వ్యక్తి బయ్యవరం గ్రామానికి వచ్చి షేక్ శ్రీనుపై దాడి చేశారు. కర్రలతో విచక్షణా రహితంగా కొట్టి పరారయ్యారు. తీవ్రంగా గాయపడ్డ శ్రీనును గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఈనెల 3వ తేదీ క్రోసూరు పోలీసులు కేసు నమోదు చేశారు. షేక్ శ్రీను చికిత్స పొందుతూ శుక్రవారం మరణించటంతో హత్య కేసుగా నమోదైంది. సీఐ పత్తిపాటి సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అక్రమ గ్రావెల్ క్వారీయింగ్‌ను అడ్డుకోవాల్సిందే..

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వైకుంఠపురం గ్రామంలో వేంకటేశ్వరస్వామి కొలువైఉన్న కొండకు దిగువన అక్రమ గ్రావెల్ క్వారీయింగ్ చేస్తే సహించేది లేదని పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు అన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక క్వారీయింగ్ నిర్వాహకులు రహదారుల నిర్మాణానికి అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపి రహదారులు నిర్మించుకున్నారని, పది రోజుల క్రితం స్థానిక సర్పంచ్ విఠల్‌రావు, మాజీ ఎంపీటీసీ బి. శ్రీనివాసరావులు కూడా గ్రామంలో అభివృద్ధి పనులకు గ్రావెల్ తవ్వకాలు జరిపి బిల్లులు చేసుకున్నారని ఆరోపించారు. అవినీతికి పాల్పడ్డ సర్పంచ్ చెక్‌పవర్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు. రానున్న రోజులలో కొండ దిగువన గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిపితే సహించేది లేదని హెచ్చరించారు.

రైతులకు దాణా అందజేత

అచ్చంపేట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపాలెం గ్రామంలో శుక్రవారం 50శాతం సబ్సిడీపై పాడి రైతులకు పశుదాణా అందజేసినట్టు పశు వైద్యాధికారి డాక్టర్ స్వాతిదేవి తెలిపారు. కార్యక్రమంలో రైతులు నెల్లూరి వెంకటయ్య, బొంతు వెంకటేశ్వర్లు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా వ్యాప్తిపై ప్రజలకు అవగాహన

క్రోసూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతవరంలో మలేరియా వ్యాధి వ్యాప్తి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. మండల ఆరోగ్య విస్తరణ అధికారి శిఖాశ్యామ్‌సన్ మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మలేరియా వ్యతిరేక నెలగా పాటిస్తున్నట్టు తెలిపారు. దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కిశోరి బాలికలు వ్యాయామం, క్రీడలపై మక్కువ చూపాలి

క్రోసూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కిశోరి బాలికలు వ్యాయామం, క్రీడలు పట్ల మక్కువ కలిగి ఉండాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్ వణుకూరి మాధవి అన్నారు. శుక్రవారం క్రోసూరులోని పలు అంగన్ వాడీ కేంద్రాల్లో కిశోరి వికాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ శారీరక వ్యాయామం, దాని ప్రాముఖ్యత, క్రీడల గురించి పలు సూచనలు చేశారు. కౌమార దశలో వ్యాయామం ఎంతో అవసరం అన్నారు. ఈ సందర్భంగా కిషోరి బాలికల చేత ఆటలు ఆడించారు. వ్యాయామం చేయించారు. పలువురు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

యోగా దినచర్యలో భాగం కావాలి

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): యోగా దినచర్యలో భాగం కావాలని ఆయుష్ వైద్యశాల డాక్టర్ షేక్ జైనాబ్ జహా అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో విద్యాశాఖ, ఆయుష్ సంయుక్త ఆధ్వర్యంలో బోధనా సిబ్బందికి నిర్వహించిన యోగా శిక్షణా కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిధిగా మాట్లాడారు. యోగా నిత్య సాధన వలన మానసిక ఉల్లాసం, ఆరోగ్యం, దృఢత్వం కలుగుతాయన్నారు. యోగా ఇన్‌స్ట్రక్టర్ కె సుజాత, బ్రహ్మయ్యలు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో శివబాబు, ఎంఆర్‌సీ సిబ్బంది, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

● జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కే మణికంఠ

క్రోసూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల నిర్వహణలో నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కే మణికంఠ హెచ్చరించారు. క్రోసూరు ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని పలు మద్యం షాపులను శుక్రవారం ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా మద్యం స్టాక్, షాపుల రికార్డులను పరిశీలించారు. అనంతరం క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. నాటుసారా ప్రభావం ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు తెలిపారు. సారారహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. నాటుసారా రూపుమాపటంలో గ్రామ పెద్దలు సహకరించాలన్నారు. ఎక్సైజ్ సీఐ టీ తులసీ, ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాసరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



మద్యం షాపులో తనిఖీ చేస్తున్న జిల్లా ఎక్సైజ్ అధికారి మణికంఠ

గంగిరెడ్డిపాలెం గ్రామాన్ని అభివృద్ధి చేస్తా..

బెల్లంకొండ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి పరుస్తానని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన సర్పంచ్ ఆసుల జగన్, మరికొంత మంది గ్రామస్తులు గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కలసి గ్రామ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. స్పందించిన ఎమ్మెల్యే గంగిరెడ్డిపాలెంలో సమస్యలన్నిటినీ పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. టీడీపీ బలోపేతానికి కృషిచేయాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యేను కలసినవారిలో కూటమినాయకులు ఉన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

బెల్లంకొండ పోలీసుస్టేషన్ సమీపంలో శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టినట్టు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం ద్విచక్ర వాహనదారులకు, లైసెన్స్ లేనివారి వాహనాలను ఆపి అపరాధరుసుం వసూలు చేశారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది శ్రీనివాసరావు, ఎల్ వెంకటేశ్వరరావు, షణ్ముక, ప్రభాకర్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక రుగ్మతల నివారణ

నకరికల్లు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): యోగా ద్వారా మానసిక ఆరోగ్యం కలుగుతుందని యోగాంధ్ర ప్రాజెక్టు డైరెక్టర్ రూస్సీరాణి అన్నారు. శుక్రవారం నకరికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగాంధ్ర కార్యక్రమాన్ని యోగా శిక్షకులతో ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయుష్ విద్యాధికారి రాజ్యలక్ష్మి ఎంపీడీవో జీ కాశయ్య, డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ ప్రసాదు, యోగా శిక్షకులు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన

సత్తెనపల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం గాయత్రి కల్చర్ సొసైటీ కళాజాత బృందం ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ రోగులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించింది. కార్యక్రమంలో హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ సిబ్బంది హృదయ రాజు, ఈశ్వర్, నాగూర్, రమాదేవి, రఘునాథ్, ల్యాబ్ టెక్నీషియన్ సుభానీ పాల్గొన్నారు.

సోలార్ సర్వీస్ సెంటర్ ప్రారంభం

దాచేపల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని పోస్టాఫీసు సెంటర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన భవానీ సోలార్ సర్వీస్ సెంటర్‌ను మాచర్ల విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నూతలపాటి సింగయ్య ప్రారంభించారు విద్యుత్ వినియోగదారులకు సోలార్ పీఎం సూర్యఘర్‌లో భాగంగా సోలార్ ప్యానల్ బిగించుకోవటం వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. సోలార్ విద్యుత్ వాడకంతో అనేక లాభాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో దాచేపల్లి ఏఈ భగవాన్, రూరల్ ఏఈ నాగేశ్వరరావు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజేశ్వరరావును ఆదర్శంగా తీసుకోవాలి

చండ్రా రాజేశ్వరరావు జీవితాన్ని, ఆశయాలను నేటి నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ నాయకులు అన్నారు. శుక్రవారం దాచేపల్లిలో సీపీఐ కార్యాలయంలో రాజేశ్వరరావు 111 జయంతి, పత్తిపాటి రోశయ్య 67వ జయంతిని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నేతలు మాట్లాడుతూ చండ్ర రాజేశ్వరరావు అంటరానితనానికి వ్యతిరేకంగా యువతలో చైతన్యం తెచ్చారని తెలిపారు. పెదగార్లపాడు గ్రామానికి చెందిన పత్తిపాటి రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో కొమర వెంకటరావు, యడ్ల భాస్కర్, పత్తిపాటి వెంకట నాగరాజు, గుల్లపల్లి మస్తాన్‌రావు, యూసఫ్ బేగం, గంగారం వలి, ఎం సైదా, ఎం నాగేశ్వరరావు, నరసయ్య పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ పునఃప్రతిష్ఠ

పిడుగురాళ్ల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జూలకల్లు గ్రామంలో శుక్రవారం దేవాలయాల విగ్రహ పునఃప్రతిష్ఠ వైభవంగా జరిగింది. శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ, శిఖర జీవధ్వజ, దేశమ్మతల్లి, సోమరాజు నవగ్రహ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

రక్తసంబంధాన్ని విస్మరించిన జగన్

● శిల్పారామం చైర్మన్ చేర్రెడ్డి మంజులారెడ్డి



మృతుల కుటుంబీకులను పరామర్శిస్తున్న శిల్పారామం చైర్మన్ చేర్రెడ్డి మంజులారెడ్డి

రెంటచింతల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రక్తసంబంధాన్ని విస్మరించి కుటుంబీకులను పక్కన పెట్టిన మాజీ సీఎం జగన్ పరామర్శల పేరుతో పోలీసుల మీద దాడిచేసిన వారి కుటుంబీకులను ఓదార్చడం ఏంటని శిల్పారామం చైర్మన్ చేర్రెడ్డి మంజులారెడ్డి ప్రశ్నించారు. మండలంలోని రెంటాల గ్రామంలో మృతిచెందిన మోరం అమరలింగారెడ్డి, పూజల నాసరయ్య, చేర్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి కుటుంబీకులను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ జగన్ తొలి ఏడాదిపాలనలో 10శాతం కూడా హామీలను నెరవేర్చలేకపోయారని విమర్శించారు. కూటమి అధికారంలోకి రావడంతోటే తాత అవ్వలకు పింఛన్ రూ. వెయ్యి పెంచి వారి హృదయాల్లో సీఎం చంద్రబాబు నిలిచిపోయారని గుర్తు చేశారు. ఈమె వెంట ఎనుముల కేశవరెడ్డి, జడ్డా కృష్ణారెడ్డి, మందలపు హనిమిరెడ్డి,గొట్టం సర్వేశ్వరరెడ్డి, ఆర్యవైశ్య నేత కొత్త ఆంజనేయులు తదితరులున్నారు.

నాగార్జునకొండ చరిత్రను తెలిపేలా క్యూ ఆర్ కోడ్



క్యూఆర్‌కోడ్ బోర్డు ఏర్పాటు చేస్తున్న వెంకటయ్య

మాచర్ల రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండలో అధికారులు శుక్రవారం కొండ చరిత్ర తెలిపేలా క్యూఆర్‌కోడ్ బోర్డులను ఏర్పాటుచేశారు. పురావస్తుశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాగార్జున కన్జర్వేటివ్ అసిస్టెంట్ వెంకటయ్య ఆధ్వర్యాన స్థానిక లాంచీస్టేషన్, నాగార్జునకొండలో ఈ బోర్డులు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకులు కొండచరిత్రను తెలుసుకునేందుకు ఈ బోర్డులు ఏర్పాటుచేశామన్నారు. కొండలోని మాన్యుమెంట్స్‌లో చారిత్రక కట్టడాల గురించి క్యూఆర్‌కోడ్‌లో వివరాలను పొందుపరిచినట్లు చెప్పారు.

పల్లెల్లో ప్రశాంతత బాధ్యత అందరిది

● ఎస్ఐ సుధీర్‌కుమార్



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ సుధీర్‌కుమార్

దుర్గి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్ఐ సుధీర్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని సమస్యాత్మక గ్రామమైన జంగమహేశ్వరపాడులో ఆయన పల్లెనిద్ర చేసి మాట్లాడారు. చిన్న చిన్న విషయాలను పెద్దవి చేసుకొని అల్లర్లు సృష్టించవద్దన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అల్లర్లు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనుమానిత వ్యక్తులు సంచరిస్తుంటే తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రోసూరు మోడల్ స్కూల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

క్రోసూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): క్రోసూరు మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ మేరీ సూజన్ శుక్రవారం తెలిపారు. 2025-26 సంవత్సరానికి ఖాళీలను భర్తీ చేయటానికి నోటిఫికేషన్ విడుదలైనట్టు ఆమె తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఖాళీ సీట్లలో చేరాలనుకొనే వారు ముందుగా ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ లేదా సీఎస్.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్ సైట్‌లలో జూన్ 10వ తేదీ లోపు వివరాలు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. 10వ తేదీ నుంచి 20వరకు అదే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకొనే వీలుంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్నవారికి జూన్ 24న పరీక్ష జరుగుతుందన్నారు. అర్హులైనవారికి పాఠశాలలో ప్రవేశం లభిస్తుందని తెలిపారు.

ఎన్ఆర్ఈజీఎస్ పథకాన్ని నీరుగారుస్తున్న కేంద్రం

క్రోసూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎన్ఆర్ఈజీఎస్ పథకాన్ని నీరుగారుస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంజిమాల రవిబాబు విమర్శించారు. శుక్రవారం ఆయన మండలంలోని ఊటుకూరులో ఉపాధి హామి కార్మికులతో మాట్లాడారు. కార్మికులకు కొన్ని నెలలుగా వేతనాలు చెల్లించకపోవటం దుర్మార్గం అన్నారు. ఇప్పటికైనా ఎన్ఆర్ఈజీఎస్ పథకానికి కేటాయింపులు పెంచటంతో పాటు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

బడ్జెట్‌లో బ్రహ్మాండంగా..

కుటుంబ వేడుకలకు కొత్త ట్రెండ్



- విస్తరిస్తున్న మినీ థియేటర్ల సంస్కృతి
- వెండి తెరలు, అద్భుతమైన బ్యాక్‌డ్రాప్‌లు
- అడుగు పెడుతూనే కొత్త ప్రపంచం ఆవిష్కృతం
- కేక్, బెవరేజెస్, ఫుడ్ ఐటెంలు ఆర్డర్‌పై సరఫరా
- తక్కువ ఖర్చుతో.. అత్యధిక ఆనందం


గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అర్బన్ ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి జన్మదినాలు, వివాహ వార్షికోత్సవాలు ఘనంగా జరుపుకోవాలన్న కోరిక ఎక్కువగా ఉంటుంది. ఫంక్షన్ హాల్స్ బుక్ చేసుకొని అతిథులను పిలిచి చేసుకో వాలంటే ఖర్చు తడిసి మోపడంత అవుతుంది. ఒకవేళ రెస్టారెంట్లకు వెళ్లినా అక్కడ కేవలం కేక్ కటింగ్‌కు మాత్రమే డైనింగ్ టేబుల్‌పై అనుమతిస్తారు. ఇంట్లో చేసుకో వాలంటే



డెకరేషన్‌కు చాలా ఖర్చు చేయాల్సి వస్తుంది. ఈ గ్యాప్‌ని కవర్ చేసేందుకు.. కొంతమంది వ్యాపారులు మినీ థియేటర్లను గుంటూరులో పలుచోట్ల ఏర్పాటు చేశారు. వాటిల్లో బర్త్‌డే, యానివర్సరీలు వం టివి చేసుకోవడానికి రూ. 3 వేలు ఖర్చు చేస్తే సరిపోతుంది. నలుగురు సభ్యులకు రూ. 2,400, ఆ తర్వాత ప్రతీ అదనపు కుటుంబ సభ్యుడికి రూ.250 చొప్పున చార్జ్ చేస్తారు. గుంటూరు నగరంలో బ్రాడీపేట, జీటీ రోడ్డు, పలకలూరు రోడ్డు వంటి ప్రాంతాల్లో ఈ మినీ థియేటర్లు చిన్న చిన్న ఫంక్షన్లకు ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి.

థియేటర్‌ని తలదన్నేలా

మినీ థియేటర్‌లోకి అడుగు పెడుతూనే ప్రజలు కొత్త అనుభూతిని పొందుతున్నారు. లోపల పెద్ద థియేటర్ స్ర్కీన్, డాల్బీ సౌండ్ సిస్టం ఏర్పాటు చేసి ఉంటుంది. స్ర్కీన్ సైజులు 135 నుంచి 180 అంగుళాలు, సౌండ్ 600 వాట్స్ నుంచి వెయ్యి వాట్స్ వరకు ఉంటున్నాయి. ఫాగ్ ఎంట్రీలు కూడా కొన్ని థియేటర్లలో ఉంటున్నాయి. ఫొటో షూట్ కావాలన్నా ఏర్పాటు చేస్తున్నారు. లోపల సినిమా సెట్‌ని తలదన్నేలా ఫాగ్ ఉంటుంది. అలానే సినిమా థియేటర్ తరహాలో సోఫాసీట్లు ఏర్పాటు చేశారు. కళ్లు మిరుమిట్లు గొలిపేలా ఎల్‌ఈడీ లైటింగ్‌ని అలంకరించారు. కేక్‌లు కట్ చేసుకోవడానికి ఒక చిన్న వేదిక ఉంటుంది. అలానే వెనక ఫంక్షన్‌ను ప్రతిబింబించేలా డెకరేషన్, లైటింగ్ ఏర్పాటు చేస్తారు. అక్కడ ఫొటోలు దిగి సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్నారు. అలానే థియేటర్ బయట కూడా మంచి బ్యాక్‌డ్రాప్‌లు ఏర్పాటు చేశారు. 16 డిగ్రీల సెల్సియస్‌తో శీతల వాతావరణాన్ని లోపల ఉండేలా మెయిన్‌టెయిన్ చేస్తున్నారు. దీంతో వేసవిలో వీటికి విపరీతమైన డిమాండ్ ఉంటుంది. అలానే ఆశ్చర్యపోయేలా డెకరేషన్స్ ఉంటున్నాయి.



ఇష్టమైన సినిమా, షోలను వీక్షిస్తూ



మినీ థియేటర్ లోపల డాల్బీ సౌండ్ సిస్టంతో.. ఎల్‌ఈడీ స్ర్కీన్ ఏర్పాటు చేశారు. అందులో ఇష్టమైన సినిమా, టీవీ షోలను వీక్షిస్తూ ఆస్వాదించొచ్చు. కొందరైతే గతంలో రికార్డ్ చేసిన ఫంక్షన్ల పెన్‌డ్రైవ్‌లు తీసుకొచ్చి వాటిని ప్రదర్శించుకొంటూ జ్ఞాపకాలను గుర్తు చేసుకొంటూ ఆనందం పొందుతున్నారు. స్నాక్స్, ఇతర ఫుడ్ ఐటెంలు, బేవరేజస్ తెప్పించుకొని సెల్ఫ్ సర్వ్ చేసుకొంటూ సంతోషంగా గడుపుతున్నారు.

అడ్వాన్స్ బుకింగ్..

ఈ మినీ థియేటర్లను అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవచ్చు. కోరుకున్న ఫుడ్ ఐటెంలను సొంతంగా తయారు చేసుకుని తీసుకెళ్లొచ్చు. ఫుడ్ డెలివరీ చేసే సంస్థలకు ఆర్డర్లు పెట్టుకోవచ్చు. మినీ థియేటర్ల యాజమాన్యాలకు చెప్పినా వాళ్లు తెప్పించి బిల్లులో వాటిని జత చేస్తారు.

కౌలుపై కలవరం!

రాజధాని రైతుల్లో కౌలు కలవరం మళ్లీ మొదలయిందా అంటే అవుననే సమాధానమే వస్తోంది. మే నెల ముగిసినా కౌలు అంశంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన లేకపోవడం, కౌలు ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలవుతోంది. గత ఐదేళ్లలో అనుభవించిన కౌలు కష్టాల నేపథ్యంలో ఈ ఏడాది కౌలు ప్రస్తావన కూడా లేకపోవడం కలవరపాటుకు కారణం.

- మే ముగిసినా ప్రారంభం కాని రాజధాని రైతుల కౌలు ప్రక్రియ
- గత ఐదేళ్లూ నరకం చూసిన రైతులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక కౌలు దక్కడంతో సంతృప్తి
- పదకొండో ఏడాది కౌలు ఊసే లేకపోవడంతో మళ్లీ ఆందోళన

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణం కోసం అవసరమైన భూములను అమరావతి పరిధిలోని 29 గ్రామాలకు చెందిన 28,800 మంది రైతులు భూ సమీకరణ కింద ఇచ్చారు. అందుకుగానూ పదేళ్లపాటు ఏటా 10 శాతం వార్షిక కౌలు రేటు పెంచి రైతులకు చెల్లించేందుకు ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందం ప్రకారం ఏటా మే నెలాఖరునాటికి రైతులకు కౌలు చెల్లించాలి. అయితే వివిధ కారణాలతో ఈ పదేళ్లలో రెండు వేల మందికి పైగా రైతులు అనర్హులయ్యారు. ప్రస్తుతం 26,500 మంది రైతులకు కౌలు చెల్లించాల్సి ఉంది. పోయిన మే నెలతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం గడువు పూర్తయింది. రైతుల డిమాండ్ మేరకు ప్రస్తుత ప్రభుత్వం కౌలు గడువున మరో ఐదేళ్లు పొడిగిస్తూ పోయిన సెప్టెంబరులో జీవో జారీ చేసింది. ఆ జీవో ప్రకారం ఈ మే నెలలో రైతులకు పదకొండో ఏడాది వార్షిక కౌలు అందాలి. కానీ ఇప్పటి వరకూ అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

గత ఐదేళ్ల భయం..

వైసీపీ పాలన సాగించిన ఐదేళ్లలో రాజధాని రైతులు నిత్య నరకం అనుభవించారు. చట్టబద్ధంగా రావాల్సిన కౌలును సైతం



ఆపి గత ప్రభుత్వం వేధించింది. దీంతో న్యాయం కోసం పోరాడాల్సి వచ్చింది. రైతులు పదే పదే కోర్టు మెట్లు ఎక్కారు. తొలి రెండేళ్లలో కోర్టు అక్షింతల అనంతరం కౌలు చెల్లించిన గత ప్రభుత్వం ఆ తర్వాత కౌలును పూర్తిగా ఎగవేసింది. అసైన్డ్ రైతులకు మూడేళ్లపాటు, సాధారణ రైతులకు రెండేళ్లపాటు కౌలు పూర్తిగా నిలిపివేసింది. రైతులు కోర్టు తలుపులు తట్టినా, న్యాయస్థానాలు హెచ్చరించనా ఆ ప్రభుత్వం లక్ష్య పెట్టలేదు. ఫలితంగా రైతులకు కౌలు దక్కలేదు. దీంతో సాధారణ రైతులు ఆకలి, అప్పులతో అల్లాడిపోయారు. పిల్లల చదువులు అర్థంతరంగా ఆపేసుకున్నారు. కౌలుపైనే ఆధారపడిన అలాంటి రైతులు గత అనుభవాల రీత్యా కలవరం చెందుతున్నారు.

రెండు విడతల బకాయిల చెల్లింపు

అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోపే కూటమి ప్రభుత్వం తొమ్మిదో ఏడాది కౌలు చెల్లింపులకు రూ.190 కోట్లు విడుదల చేసింది. మెట్ట రైతులకు ఎకరానికి రూ.54వేలు, జరీబు రైతులకు రూ.95వేల చొప్పున వార్షిక కౌలు రైతులకు అందించింది. కాగా పదో విడత కౌలు నిమిత్తం రూ.255 కోట్లు ఈ ఏడాది సంక్రాంతి పండుగ రోజున చెల్లించింది. ఈ మే నెలలో రైతులకు పదకొండో ఏడాది కౌలు అందాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకూ సీఆర్డీఏ కౌలు లెక్కింపు ప్రక్రియ కూడా ప్రారంభించలేదని రైతులు వాపోతున్నారు. కనీసం కౌలుకు సంబంధించిన ప్రకటన కూడా ప్రభుత్వం వైపు నుంచి లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో కౌలు పైనే ఆధారపడే సాధారణ కుటుంబాలు మరింత భయపడుతున్నాయి.

క్షయ రహిత సమాజం దిశగా

టీబీ ముక్తి భారత్ పేరుతో ప్రణాళిక



సత్తెనపల్లి జూన్ 6(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిని పారద్రోలడానికి ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, అమలు చేస్తోంది. టీబీ ముక్తి భారత్ నినాదంతో వ్యాధి నుండి ప్రజలను విముక్తి చేయడానికి వైద్యఆరోగ్య శాఖ పలు చర్యలు చేపట్టింది. అన్ని గృహాలకు వెళ్లి టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి వైద్య సిబ్బందిని రంగంలోనికి దింపింది. సత్తెనపల్లి ఏరియా వైద్యశాల పరిధిలోని టీబీ యూనిట్‌లో సత్తెనపల్లి, ఫణిదం, ముప్పాళ్ల, పెదకూరపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో 180 మంది వరకు క్షయ బాధితులున్నారు. ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 30 వేల మందికి టీబీ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సత్తెనపల్లి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ స్టాలిన్ తెలిపారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి ఎక్కువ రోజులు దగ్గుతో బాధపడుతున్న వారి నుండి కఫం నమూనాలను సేకరిస్తారు. మద్యం, ధూమపానం అలవాటు ఉన్నవారు, మధుమేహం, కిడ్నీ సంబంధిత, హెచ్ఐవీ, క్యాన్సర్ ఇతర దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి, క్షయకు మందులు వాడి తగ్గిపోయిన వారి కుటుంబ సభ్యులకు టీబీ పరీక్షలు నిర్వహిస్తారు. అవసరమైన వారికి ఎక్స్‌రే, స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలలకు సరిపడా మందులను ఉచితంగా అందిస్తారు. అంతే కాకుండా క్షయ పోషణ పథకం కింద ప్రతి నెలా వెయ్యి రూపాయలను వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. క్షయ నివారణ మందులను క్రమం తప్పకుండా వాడేలా ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు సర్వే

పాఠశాలలో పొగాకు కంపు..

- వంగిపురం ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో పొగాకు బేళ్లు
- అదే ఆవరణలో అంగన్వాడీ, వెల్‌నెస్ కేంద్రాలు
- పొగాకు కోరుతో విద్యార్థులకు తప్పని ఆరోగ్య సమస్యలు



వంగిపురం పాఠశాల వరండాలో నిల్వ ఉంచిన పొగాకు బేళ్లు

ప్రత్తిపాడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బహుళార్థక సాధక ప్రాజెక్ట్ లాగా వంగిపురం ప్రాథమిక పాఠశాల బహుళ కార్యాలయాలకు, అవసరాలకు నిలయంగా మారింది. పంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న ఈ ప్రాథమిక పాఠశాల ప్రాంగణాన్ని స్థానికులు వారి ఇష్టమొచ్చినట్లుగా ఉపయోగిస్తున్నారు. దీంతో పాఠశాల పాడుబడిపోతోంది. ఈ పాఠశాల ప్రాంగణంలో గదులు ఖాళీగా ఉండటంతో వెల్‌నెస్ సెంటర్, అంగన్వాడీ కేంద్రం ఇక్కడే నడుస్తున్నాయి. ప్రస్తుతం పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో.. పాఠశాల భవనంలో స్థానికులు పొగాకు బేళ్లు వేశారు. ప్రాంగణం మొత్తం పొగాకు వాసనతో ఘాటెక్కి పోయింది. వారం క్రితం అంగన్వాడీ కేంద్రాన్ని రీ ఓపెన్ చేశారు. ఇక ఆరోగ్య కేంద్రానికి నిత్యం వచ్చే రోగులు ఈ పొగాకు ఘాటుకే.. ఆసుపత్రిలో చేరేలా ఉన్నారు. ఇంకో వారం రోజుల్లో పాఠశాలలు కూడా పునఃప్రారంభం కానున్నాయి. పాఠశాల ఆవరణలో ఉన్న పొగాకును ఇప్పుడు తీసినప్పటికీ దాని ఘాటు మాత్రం చాలా కాలం అలాగే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల తిమ్మాపురంలో గిడ్డంగిని ఓపెన్ చేశారు. అందులో రైతులు తమ ఉత్పత్తులను నిల్వ చేసుకునే అవకాశం ఉంది. ఆ గిడ్డంగి ప్రారంభం కాకముందు రైతులు తాము పండించిన పొగాను నిల్వ ఉంచుకునేందుకు అవకాశం లేకపోవడం వల్ల ఇక్కడ నిల్వ ఉంచుకున్నారు. ఆ తరువాత అయినా ఇక్కడి నుండి నిల్వలను తరలించాల్సి ఉంది. కాని అలా చేయక పోవడంతో ఇప్పుడు ప్రజలతో పాటు చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులు స్పందించి ఇక్కడి నుండి పొగాకు బేళ్లు తీసి వేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



పాఠశాల ప్రాంగణంలో నిల్వ ఉంచిన పొగాకు బేళ్లు



ఫ్రై..డే

ప్రతాపం చూపిస్తున్న రోహిణి

రోహిణి ప్రథమార్థంలో రుతుపవనాల వల్ల కొంత చల్లబడినా.. తరువాత నైరుతి ముఖం చాటేయడంతో గత నాలుగు రోజులుగా తన ప్రతాపం చూపుతోంది. దీంతో ఉదయమే వేడిగాలులు వీస్తున్నాయి. శుక్రవారం ఎండ ప్రభావం మరింత ఎక్కువగా ఉంది. ఎండ నుంచి రక్షణ కోసం స్కార్ఫ్‌లు, గొడుగులను ఉపయోగిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లోనే ప్రజలు బయటికి వస్తున్నారు. - గుంటూరు- ఆంధ్రజ్యోతి







ఇలా అయితే.. ఎలా సహకరించాలి?

సీఆర్డీఏ అధికారులను నిలదీసిన రైతులు



సీఆర్డీఏ అధికారులకు సమస్య చెబుతున్న రైతు పున్నయ్య

తుళ్లూరు, (మందడం) జూన్ 6, (ఆంధ్రజ్యోతి): 'గ్రామ కంఠాల తేల్చరు.. ప్లాట్లకు వీధి పోట్లు వచ్చాయని సమస్య చెబితే.. పెడచెవిన పెడతారు.. మీకు ఏ రకంగా సహకరించాలి.' అని సీఆర్డీఏ అధికారులను మందడం రైతు లు నిలదీశారు. మంద డం సీఆర్డీఏ యూనిట్ ఆఫీసులో డిప్యూటీ కలెక్టర్ భాగ్యరేఖ అధ్యక్షతన ఈ-8 రోడ్డు కింద ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించారు. రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు లేకుండా ఉండాలనే ఉద్దేశంతో సమావేశం ఏర్పాటు చేశామని డీసీ కోరటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందు రోడ్డు వేయండి.. అక్కడి వరకు వచ్చిన తరువాత స్వచ్ఛందంగా ఖాళీ చేస్తామని రైతులు స్పష్టం చేశారు. నీరుకొండ స్వప్నకు చెందిన ఆరు ఎకరాలకు సంబంధించిన ప్లాట్లు, మాదల శ్వేతకు చెందిన రెండున్నర ఎకరాలకు చెందిన రిటర్నబుల్ ప్లాట్లు ల్యాండు ఎక్విజేషన్ భూములలో కేటాయించారని ఇంత వరకు... ఆ సమస్య తేల్చలేదని నిలదీశారు. ఇలాగైతే ఎలా సహకరించాలని రైతులు ప్రశ్నించారు. రోడ్డు కింద పోతున్న ఇళ్లు ఖాళీ చేస్తాం ..తిరిగి ఎక్కడ ఇస్తారో చెప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువులు, కాల్వల వెంట ఇళ్ల స్థలాలు ఇస్తామని చెబుతున్నారని.. వాటిని ఏం చేసుకోవాలని ప్రశ్నించారు. ముందు సమస్యలు పరిష్కరించాలని రైతులు సమావేశంలో కోరారు. ఆలయాలున్నాయనే పేరుతో రోడ్డు ఎలైన్‌మెంటు మార్చారని, దీంతో రోడ్డు కింద ఇళ్ల స్థలాలు కోల్పోయే వారి సంఖ్య పెరిగిందని చెప్పుకొచ్చారు. దీనిపై పునరాలోచన చేయాలని రైతులు అధికారులకు సూచించారు. సమస్యలు పరిష్కరించమని కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడని రైతు మాదల పున్నయ్య సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు.

న్యాయ విద్యార్థులకు శిక్షణ తరగతులు



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న న్యాయవాదులు, విద్యార్థులు



ప్రసంగిస్తున్న రిటైర్డ్ జస్టిస్ యూ దుర్గాప్రసాద్‌రావు

తాడేపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తాడేపల్లి మండల పరిధిలోని కేఎల్ యూనివర్సిటీలో అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలూ) ఆధ్వర్యంలో న్యాయ విద్యార్థులకు శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఐలూ అధ్యక్షుడు వికాస్ రంజన్ భట్టాచార్య (రాజ్యసభ సభ్యుడు) సెషన్‌ను ప్రారంభించగా, ఏపీ హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ యూ దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టాచార్య మాట్లాడుతూ న్యాయ విద్యార్థులు నిత్యం శ్రమిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని, ఉత్తమ న్యాయవాదులుగా ఎదుగుతారని అన్నారు. సబ్జెక్టుపై అవగాహనతో పాటు సామాజిక దృక్పథం కూడా ఉండాలని తెలిపారు. నిర్వాహకులు నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ న్యాయ శాస్త్రాన్ని అభ్యసిస్తున్న విద్యార్థులకు 15 అంశాలపై తమ ప్రతిభను, నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఈ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారు. రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్‌రావు మాట్లాడుతూ పార్టీషన్ దావాల గురించి వివరించగా, పలువురు వక్తలు, న్యాయవాదులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణా తరగతుల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ బార్ అసోసియేషన్‌ల నుండి న్యాయవాదులు, 500 మందికి పైగా న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, ఈ శిక్షణ తరగతులు శనివారం కూడా కొనసాగుతాయని నిర్వాహకులు నర్రా శ్రీనివాసరావు తెలిపారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

బనకచర్ల ప్రాజెక్టుపై సర్వే

బొల్లాపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేమిడిచర్ల, గుమ్మనంపాడు, మేళ్ళవాగు సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో బనకచర్ల ప్రాజెక్టుపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. శుక్రవారం గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఎంపీడీవో పీ సీతారామయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బనకచర్ల ప్రాజెక్టు సర్వే జరుగుతున్నందున గ్రామస్థులు అధికారులకు సమాచారం తెలియజేయాలన్నారు. ఆయన వెంట ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు సీనియర్ సిటిజన్ల యోగాంధ్ర: కలెక్టర్

నరసరావుపేట కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల పట్టణాలలో జూన్ 8న సీనియర్ సిటిజన్‌తో ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. శుక్రవారం దీనిపై అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 9న గ్రామాలు, మండల కేంద్రాలు, మున్సిపాలిటీలలో యోగాంధ్ర ర్యాలీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శుక్రవారం పల్నాడు బస్టాండ్ వద్ద పెద్దచెరువు రోడ్డులో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 200మంది పాల్గొన్నారు.

క్లుప్తంగా...

● రొంపిచర్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెం మోడల్ పాఠశాలలో ఈ నెల 10వ తేదీ నుంచి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ రవినాయక్ శుక్రవారం తెలిపారు. 7, 8, 9, తరగతుల్లో ఉన్న అతి కొద్దిసీట్లను భర్తీ చేయటానికి ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

● ఈపూరు: ఏపీ మోడల్ స్కూల్‌లో 6 నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రవేశం కోసం ఈ నెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ ఇనుగంటి సునీల్ చౌదరి తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు పత్రాలను స్కూల్‌లో అందజేయాలన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని కొనకంచివారిపాలెం గ్రామానికి చెందిన మొండితోక రాణి మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని మొండితోక రాణిని, పాలకవర్గ సభ్యులను అభినందించారు.

● చిలకలూరిపేట: నాగార్జునసాగర్ కాల్వ నీటితో పట్టణ రెండు తాగునీటి చెరువులను పూర్తిగా నింపినట్టు మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విజ్ఞప్తి మేరకు సాగర్ కాల్వల అధికారులు కాల్వకు 4 రోజులు అదనంగా నీటి సరఫరా జరిపారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్లు బేరింగ్ మౌలాలి, కూనల ప్రమీల, కె లక్ష్మీ తిరుమల, జంగా సుజాత పాల్గొన్నారు.

● వినుకొండ: 10వ తరగతి రీవెరిఫికేషన్ ఫలితాల్లో వెల్లటూరు రోడ్డులోని గుడ్‌షెపర్డు పాఠశాలకు చెందిన విద్యార్థి బొత్స సింధుప్రియ 600గాను 595 మార్కులు సాధించి టౌన్ ఫస్టు సాధించినట్లు పాఠశాల డైరక్టర్ డాక్టర్ ఇన్నారెడ్డి శుక్రవారం తెలిపారు. దీంతో పాఠశాలలో సంబరాలు జరుపుకున్నారు.

● శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనంలో ఎండీఎం ఆపరేటర్‌లు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంఈవోలు సాంబశివరావు, లలితాకుమారి తెలిపారు. స్థానిక జడ్పీ పాఠశాలల్లో మండలంలోని ఎండీఎం ఆపరేటర్లు, ఆయాలకు శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

● రొంపిచర్ల: మండలంలోని గోగులపాడులోని గంగా పార్వతి సమేత చంద్రమౌళేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. కుంకుమార్చన పూజలను నారాయణ రుక్మిణీ కృష్ణమాచార్యులు నిర్వహించారు..

● నరసరావుపేట టౌన్: ఈ నెల 9వ తేదీ నుంచి ఉచిత యోగా శిక్ష పట్టణంలోని పట్టాభిరామస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో శిబిరం ప్రారంభం అవుతుందని శ్రీవెంకటేశ్వర యోగా సేవ కేంద్రం నరసరావుపేట శాఖ నిర్వాహకులు కూనిశెట్టి వెంకట జనార్ధన్ శుక్రవారం తెలిపారు. సమాచారం కోసం కన్వీనర్ కూనిశెట్టి అనూరాధ, 9490846333, 9491665733ను సంప్రదించాలన్నారు.

● ఈపూరు: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. శిబిరాన్ని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్యతో కలిసి టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రావర్ల జగ్గారావు ప్రారంభించారు.

● నూజెండ్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతికి పీ - 4 విధానం మార్గదర్శకంగా నిలబడుతుందని వెటర్నరీ కౌన్సిల్ ఛైర్మన్ పారా వెంకటలక్ష్మయ్య అన్నారు. మండలంలోని గుండ్లకమ్మ, గ్రామోద్యయ ఆధ్వర్యంలో శుక్రవారం భూమాయపాలెంలో పర్యటించి పీ- 4కు ఎంపిక చేసిన బంగారు కుటుంబ సభ్యులను యూపీఎస్‌ఈ సివిల్స్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులు కలసి వివరాలు సేకరించారు.

● నూజెండ్ల: మండలంలోని కొత్త కొత్తపాలెం ఎస్సీ కాలనీలో పాఠశాల స్థలంలో దేవాలయ నిర్మాణం వివాదంగా మారటంతో ఎంఈవోలు సాంబశివరావు, రవిచంద్రలు శుక్రవారం పరిశీలించారు.

● నాదెండ్ల: మండలంలోని చిరుమామిళ్ళలో కిషోరి వికాసం వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా శారీరక వ్యాయామం, క్రీడల ప్రాముఖ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ కే పద్మ, కే రాజ్యలక్ష్మి, ఆషా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో ప్రజావేదిక



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు నియోజవర్గంలోని ప్రజల వద్ద నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ప్రజా వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రతి శుక్రవారం ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ప్రజావేదిక నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల వద్ద నుంచి పెద్దఎత్తున వినతి పత్రాలు వస్తున్నాయని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేలా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారులతో సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు పాల్గొన్నారు.

వీరవట్నంలో ఎమ్మెల్యే పల్లె నిద్ర

రొంపిచర్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరవట్నం గ్రామంలో గురువారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఆయన సతీమణి సుధారాజేశ్వరిలు పాల్గొన్నారు. రూ.2 లక్షల వ్యయంతో నిర్మించిన రచ్చబండను ఆయన ప్రారంభించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ నెలలో తల్లికి వందనం, రైతులకు నగదు జమ చేయనున్నట్టు తెలిపారు. ప్రజా సమస్యలు తెలుసుకోవటం కోసం ప్రజా వేదిక, పల్లె నిద్ర కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రతిరోజు పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్, జాష్టి ప్రసాదు, చల్లా సుబ్బారావు, మాలెంపాటి పెద ఏడుకొండలు, గొట్టిపాటి రాజారావు, వెలగటూరి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన అడుసుమల్లి సాత్విక్ ఇటీవల వెలువడిన జేఈఈ మెయిన్స్‌లో 22వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు అతన్ని అభినందించారు.



వీరవట్నంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అరవింద బాబు

రైతులకు మేలు జరిగేలా పాలకవర్గం పనిచేయాలి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు
● నరసరావుపేట మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా పూనాటి, వైస్ ఛైర్మన్‌గా కాసా బాధ్యతల స్వీకారం



రైతులకు తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చదలవాడ, ఛైర్మన్ శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ ఆంజనేయులు తదితరులు

నరసరావుపేట టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు జరిగేలా పాలవర్గం పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం నరసరావుపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా పూనాటి శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్‌గా కాసా ఆంజనేయులు, 13 మంది డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ వ్యవసాయరంగాన్ని పరిపుష్టి చేసేందుకు మార్కెట్ కమిటీ చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీనియర్ టీడీపీ నాయకుడు కొల్లి బ్రహ్మయ్య మాట్లాడుతూ నియోజకవర్గ మార్కెట్ యార్డుకు విశేషమైన చరిత్ర ఉందన్నారు. అత్యధిక మంది టీడీపీ నాయకులే ఛైర్మన్‌లుగా పనిచేశారన్నారు. వారందరూ కష్టపడి పనిచేసిన వారేనని, ప్రస్తుత ఛైర్మన్ పూనాటి శ్రీనివాసరావు విద్యార్థి దశ నుంచే పోరాటపటిమ కలిగిన వ్యక్తి అన్నారు. ఈ స్థాయికి ఆయన అంచెలంచెలుగా ఎదిగారని అభినందించారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ కాసా ఆంజనేయులు మాట్లాడుతూ నమ్మి రైతులకు సేవచేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు చేతులమీదగా 61మంది రైతులకు రాయితీ మీద రూ.12,05,516లు విలువైన తైవాన్ స్ప్రేయర్లు, వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్‌లు కడియాల రమేష్‌బాబు, పులిమి వెంకటరామిరెడ్డి, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

దేవాలయాలు ప్రజల్లో శాంతిని పెంపొందిస్తాయి

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): దేశాలయాలు ప్రజల్లో శాంతిని పెంపొందిస్తాయని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని గాంధీనగర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీసీతారామ చంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ ప్రతిష్ఠ మహోత్సవంలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిద్దరిని పూలమాల వేసి ఘనంగా సన్మానించి, తీర్ధ పరసాదాలు అందచేశారు. అనంతరం జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు సమాజంలో భక్తిని, సంతోషాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామస్థులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ మక్కెన

ఘనంగా కనకదుర్గా దేవి ఆలయ వార్షికోత్సవం

వినుకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని విష్ణుకుండీనగర్‌లోని కనకదుర్గా దేవి అమ్మవారి దేవస్థానం 16 వార్షికోత్సవం వేడుకలను పురష్కరించుకుని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీ బ్యాంక్ ఛైరమన్ మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేనా పార్టీ జిల్లా కార్యదర్శి నిశ్శంకర శీరనివాసరావు, వీర మహిళ వాణి, కొంజేటి నాగశ్రీను రాయల్, చిరుమామిళ్ల కోటేశ్వరరావు, డీసీ గంగినేని రాఘవ, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, కూటమి నేతలు పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేస్తాం

● మార్క్‌ఫెడ్ ఎండీ మనజీర్ జిలానీసామూన్
● పర్చూరు కొనుగోలు కేంద్రంలో గ్రేడింగ్ పరిశీలన



ఏఎంసీ గోడౌన్‌లో పొగాకు గ్రేడింగ్‌ను పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ ఎండీ జిలానీ సామూన్, ఐటీసీ అధికారులు

పర్చూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద ఉన్న నల్ల బర్లీ పొగాకు నిల్వలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఏపీ మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) మనజీర్ జిలానీసామూన్ తెలిపారు. శుక్రవారం పర్చూరులోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని గిడ్డంగులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు లేక ఇబ్బంది పడుతున్న నల్లబర్లీ పొగాకు రైతులను ఆదుకోవాలన్న సంకల్పంతో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు సిద్ధమైందన్నారు. చివరి రైతు వరకు కొనుగోలు చేసేలా చర్యలు చేపడతామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతుల సంక్షేమం కోసం హెచ్‌డీబీఆర్ (నల్ల బర్లీ) పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. నాణ్యతను ప్రామాణికంగా తీసుకుని గ్రేడ్లుగా విభజించి ప్రభుత్వం ప్రకటించిన ధరకు కొనుగోలు చేసేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఇందుకు రైతులు కూడా సహకరించాలన్నారు. పొగాకు నిల్వలను దృష్టిలో పెట్టుకుని మూడు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో చేపడుతున్న పొగాకు గ్రేడింగ్‌ను పరిశీలించారు. బాపట్ల ఆర్డీవో గ్లోరియా, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, తహసీల్దారు బ్రహ్మయ్య ఐటీసీ ప్రతినిధి కల్యాణరామిరెడ్డి, ఏఎంసీ స్పెషల్ కార్యదర్శి దేవరకొండ తిరుపతిరాయుడు, అసిస్టెంట్ కార్యదర్శి ప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కృష్ణ, కొల్లా శ్రీనివాసరావు, పోట్రు శోభన్, అడగడ్డ వెంకటేశ్వర్లు, అడగడ్డ రామకృష్ణ, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్‌ల శిక్షణలో మెళకువలు నేర్చుకోవాలి

● ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనీలత

శావల్యాపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మహిళల జీవనోపాధులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన కుట్టుమిషన్‌ల శిక్షణలో మహిళలు మెళకువలు బాగా నేర్చుకొని తగిన నైపుణ్యాలను సాధించాలని ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనీలత అన్నారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శావల్యాపురం జడ్పీ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ల శిక్షణ కేంద్రాన్ని పీడీ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. మహిళలకు ఇస్తున్న శిక్షణను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. పీడీ మాట్లాడుతూ కుట్టుమిషన్‌ల శిక్షణతోపాటు వివిధ జీవనోపాధి మార్గాలను ఎంచుకొని పట్టుదలతో వాటిని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఆహార ఉత్పత్తులను తయారు చేసినట్లయితే వాటిని ఇతర రాష్ట్రాల్లో విక్రయించేలా తమవంతు సహకారం అందిస్తామన్నారు. కుట్టుమిషన్‌ల శిక్షణానంతరం మహిళలు పరీక్ష నిర్వహించి నైపుణ్యాన్ని ప్రదర్శించిన వారికి ప్రభుత్వం కుట్టుమిషన్‌లను ఉచితంగా అందిస్తుందన్నారు.

విస్తృత స్థాయిలో విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు

నరసరావుపేట లీగల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో విద్యుత్ అధికారులు పలు బృందాలుగా ఏర్పడి శుక్రవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో అనుమతించిన లోడ్ కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 68మందికి రూ.3,60,800, అనుమతించిన కేటగిరీకి కాక ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న ముగ్గురికి రూ.8000 అపరాధ రుసుం విధించారు. తనిఖీలకు విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం పల్నాడు జిల్లా పర్యవేక్షకఇంజనీర్ డాక్టర్ పి విజయ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● ఎంపీపీ ఝాన్సీ

యడ్లపాడు, జూన్ 6 (ఆంధ్రజోతి): గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధుతో కలసి సమన్వయంతో పనిచేయాలని లేదంటే పథకాల అమలే ప్రశ్నార్థకమవుతుందని ఎంపీపీ పి.ఝాన్సీ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఝాన్సీదయాసాగర్ అధ్యక్షతన జరిగింది. ప్రజాప్రతినిధులు అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో తొలుత శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కీలక శాఖలకు సంబంధించిన అధికారులు హాజరుకాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సొలస ఎంపీటీసీ సభ్యుడు మద్దారి శ్రీనివాసరెడ్డి స్పందిస్తూ మూడు నెలలకు ఒకసారి సమావేశం పెట్టినా అధికారులు రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెవెన్యూ భూముల సమస్యపై వినతి ఇస్తే దానిని దేవదాయశాఖకు పంపించారని, ఆ సమస్య ఎలా పరిష్కారమవుతుందని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టిన ఆయన ప్రజా సమస్యలపై చర్చించడానికి, చెప్పుకోవడానికి అధికారులే లేకపోతే సమావేశాలు అర్థం లేనివిగా మిగులుతాయన్నారు. అధికారుల వద్ద మాకు ఎలాంటి గౌరవం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వాట్సాప్‌లలో కాకుండా స్థానిక ప్రజాప్రతినిధులకు నేరుగా సమాచారం ఇవ్వడం అధికారుల బాధ్యత అని ఎంపీటీసీ సభ్యుడు అరుణ్‌కుమార్ స్పష్టం చేశారు. సమావేశంలో డాక్టర్ భరద్వాజ, ఏఈ జానీబాషా, ఏపీవో డి సుందరరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జోజమ్మ, ఆర్ఐ సుబ్బారావు, ఏఈవో ప్రతాప్, పంచాయితీ కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బక్రీద్ పండుగ త్యాగానికి, భక్తికి ప్రతీక

● ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ త్యాగానికి, భక్తికి ప్రతీక అని ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఆయన శుక్రవారం ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ముస్లింలు బక్రీద్ పండగ జరుపుకోవాలన్నారు. ఈ పండుగ ప్రజలందరి జీవితాల్లో శాంతి, సంతోషం, సౌభాగ్యాన్ని తీసుకురావాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ముస్లింలు బక్రీద్ పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా వ్యాప్తంగా గో సంరక్షణ చట్టం 2017 అమలులో ఉందని, గోవులను వధించడం పూర్తిగా నిషిద్ధమన్నారు. ఈ చట్టాన్ని ఎవరైనా అతిక్రమిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా, సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. పండుగ సందర్భంగా ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తామన్నారు.

వివిధ శాఖల అధికారులతో న్యాయాధికారి సమీక్ష

నరసరావుపేట లీగల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జూలై ఐదున స్థానిక న్యాయస్థానం ఆవరణలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి శుక్రవారం ప్రధాన జూనియర్ సివిల్ న్యాయాధికారి ఆశీర్వాదం పాల్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరసరావుపేట న్యాయస్థానం పరిధిలో ఉన్న సివిల్ కేసులు రాజీ పడదగిన అన్ని క్రిమినల్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాల్సిందిగా కోరారు. దీనివల్ల కక్షిదారులకు సమయం, ధనం ఆదా అవుతుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాల్సిందిగా ఆమె కోరారు. కార్యక్రమంలో చిట్‌ఫండ్, బ్యాంక్, బీఎస్ఎన్ఎల్ ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వినుకొండలో కుక్కల పట్టివేత

వినుకొండ టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చీఫ్‌విప్ ఆదేశాల మేరకు పట్టణ పరిధిలోని వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కార్యక్రమాన్ని 5వ విడత ఏబీసీ (యాంటీ బర్త్ కంట్రోల్) చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ శుక్రవారం తెలిపారు. ప్రజలు తమ పరిధిలోని సచివాలయంలో ఫిర్యాదు చేపట్టినట్లయితే కుక్కల పట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.